Follow: @ANNTELUGU

ANN తెలుగు

# మహా పత్రిక

24-08-2026

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 219 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏపీ మద్యం రవాణా స్కామ్

మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్

- కొండాపూర్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు
- ఇప్పటికే కారుమూరి కుమారుడితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసిన దర్యాప్తు సంస్థ

**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను ఇప్పటికే ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ మంత్రి కుమారుడు కారుమూరి సునీల్ కూడా ఉన్నారు. నిందితులందరూ వైసీపీ హయాంలో ఏపీ లిక్కర్ రవాణాలో అక్రమాలకు పాల్పడినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. కాంట్రాక్టుల ద్వారా రూ.28 కోట్ల వరకు ముడుపులు మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### 'రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్'గా రాహుల్ గాంధీ





- ఆన్ లైన్ లో వైరల్
- కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల పోస్టర్లు

02

### జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు



- వరంగల్ - ఖమ్మం గ్రాడ్యుయేట్ స్థానం నుండి పోటీ
- పవన్ కల్యాణ్‌కు గడల శ్రీనివాసరావు కృతజ్ఞతలు

02

### జనసేనలోకి కొండా సుస్మిత?



- నేడు నేతలతో భేటీ ప్రచారం
- సీఎం రేవంత్‌పై సుస్మిత వ్యాఖ్యలు సంచలనం
- సురేఖపై కాంగ్రెస్ నేతల తీవ్ర ఆగ్రహం

02




రాజకీయకోణంలోనే

## అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ

- లండన్ పర్యటన విజయవంతం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ కు సీఎం
- నేడు లేదా రేపు మీడియాముందుకు

**హైదరాబాద్, మహా :** రాజకీయ కోణంలోనే తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అనుమతి నిరాకరణ నేపథ్యంలో అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు 'ఎక్స్'లో రేవంత్ పోస్ట్ పెట్టారు. ''రాజకీయ కారణాల రీత్యా నా అమెరికా పర్యటనకు విదేశీ వ్యవహారాల శాఖ అనుమతి నిరాకరించింది. ఈ నేపథ్యంలో అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నా. విదేశీ పర్యటన అంశంలో నాకు మద్దతుగా నిలిచిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కృతజ్ఞతలు. లండన్ పర్యటనను విజయవంతంగా ముగించుకున్నాను. హైదరాబాద్‌కు వస్తున్నా. అక్కడికి వచ్చాక మిగిలిన అంశాలపై మాట్లాడతా. గత మూడు రోజులుగా పార్టీ, నేతలు, ప్రజల నుంచి లభించిన అద్భుతమైన మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ కు చేరుకోనున్న సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం లేదా మంగళవారం మీడియా ముందుకు వచ్చే అవకాశం ఉంది. కేంద్రం అనుమతి నిరాకరణపై ఆయన స్పందించనున్నారు.

**లండన్ లో మీట్ అండ్ గ్రీట్**

ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని లండన్‌లో తెలుగు ప్రవాసులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ఉదయం లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగతిపై చర్చించారు. తెలుగు సమాజం ప్రతినిధులతో సీఎం, మంత్రి ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసులు కూడా భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా బలంగా ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలని కోరారు.

# శంషాబాద్‌లో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా..!



## జీ.ఓ. 111 కు తూట్లు...!

- నాలా కన్వర్షన్ లేకుండానే యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు...!
- డాక్యుమెంట్ నంబర్ 197/2026లో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్...!
- అంతా జూనియర్ అసిస్టెంట్ 'నజీరుద్దీన్' కనుసన్నల్లోనే...!
- ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డితో కుమ్మక్కై దందాకు తెగబడిన వైనం...!
- అక్రమార్కులకు బ్యాక్‌బోన్‌గా 'ఓ' టీఎన్‌జీఓ నాయకుడు...!
- లేని విల్లాలకు పి టి ఐ ఎన్ నంబర్లు, ఇంటి నంబర్లు కేటాయింపు...!
- పాపంలో పాలు పంచుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు...!
- కోట్ల రూపాయలు చేతులు మారాయంటూ స్థానికంగా జోరుగా సాగుతున్న చర్చ...!
- ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అనుచరులకే రిజిస్ట్రేషన్ చేసామంటూ ఒప్పుకున్న ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్...!
- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ దృష్టి సారించాలని స్థానికుల డిమాండ్...!

**శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్** కార్యాలయం అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా మారింది.. జీ.ఓ. 111 కు తూట్లు పొడుస్తూ.. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే తప్పకుండా నాలా కన్వర్షన్ చేయాల్సి ఉంటుంది.. కానీ ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్, జూనియర్ అసిస్టెంట్ లు కలిసి రియల్ మాఫియాతో కుమ్మక్కై యథేచ్ఛగా అక్రమ రిజిస్ట్రేషన్లకు తెగబడ్డారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొండుపల్లి వార్డు 119, సర్వే నంబర్లు 211, 212 లకు సంబంధించిన ఓ భారీ అక్రమ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నంబర్ 197/2026 జనవరి 7 న జరిగిన డాక్యుమెంటే అక్రమ రిజిస్ట్రేషన్లకు నిలువెత్తు నిదర్శనమంటూ స్థానికంగా బహిరంగ చర్చ జరుగుతోంది..జూనియర్ అసిస్టెంట్ 'నజీరుద్దీన్' కనుసన్నల్లోనే ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డితో కలిసి ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయల గండి కొట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమార్కులకు బ్యాక్‌బోన్‌గా 'ఓ' టీఎన్‌జీఓ నాయకుడి అండదండలు మెండుగా ఉండటంతో వీరి దందా నిత్యకల్యాణం పచ్చతోరణంలా సాగిందని ఏ ముగ్గురు కలిసినా ఇదే ప్రధాన చర్చగా కొనసాగడం విశేషం.. తామేమీ తక్కువ కాదంటూఈ పాపంలో పాలు పంచుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు లేని విల్లాలకు పీటీఐఎన్ నంబర్లు, ఇంటి నంబర్లు కేటాయించి గురుభక్తిని చాటుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఈ దందాలో రిజిస్ట్రేషన్ల కోసం కోట్ల రూపాయలు చేతులు మారినట్లు బహిరంగ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అనుచరులకే రిజిస్ట్రేషన్ చేశామంటూ ఆనాటి ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డి చెప్పడం కొసమెరుపు.






## కాంగ్రెస్ 1000రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

02

## ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ వ్యూహాలు

నేడు మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం, మీనాక్షి నటరాజన్ జూమ్ సమావేశం

06

తెలంగాణ రక్షణ సేన

## 14 దేశాలకు పార్టీ అధ్యక్షుల నియామకం

మహారాష్ట్రకు కూడా చీఫ్



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రక్షణసేన (టీఆర్ఎస్).. వివిధ దేశాలకు పార్టీ అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్ట్రేలియా (కిషోర్ కత్తి), యూకే (సుమన్ రావు బాల్మూరి)కెనడా (వెంకట్రామన్ మెట్‌పల్లి), యూఏఈ (శేఖర్ గౌడ్ ఆరె) సహా 14 దేశాలకు పార్టీ అధ్యక్షులను నియమించారు. మహారాష్ట్ర శాఖకు అధ్యక్షుడిగా సుల్గే శ్రీనివాస్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలను ఏకం చేస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని కవిత సూచించారు.

## ఖర్గేను కలిసిన కొండా సురేఖ బెంగళూరులో భేటీ

- బెంగళూరులో భేటీ
- ఎయిర్ పోర్ట్ లో బిజెపి చీఫ్ తో ముచ్చట



ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన తర్వాత

## కొండా సురేఖపై చర్యలు

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



**నిజామాబాద్, మహా :** ఏమైనా సమస్యలు ఉంటే పార్టీలో అంతర్గతంగా చెప్పుకోవాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. ఏదైనా సమస్యలుంటే చెప్పుకునేందుకు పార్టీలో వివిధ కమిటీలు ఉన్నాయన్నారు. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి కేసీ వేణుగోపాల్‌కు చెప్పుకోవచ్చన్నారు. అంతేగానీ పార్టీ లైన్ దాటి బహిరంగ విమర్శలు చేయొద్దని హితవు పలికారు. ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన తర్వాత కొండా సురేఖపై చర్యలు ఉంటాయన్నారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఎవరిపైనైనా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

### నిజామాబాద్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

02



## ఆడె గజేందర్ బర్త్ డే వేడుకల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

- పార్టీ బలోపేతానికి గజేందర్ కృషి అభినందనీయం
- ఓటమి తర్వాతా చురుకుగా పనిచేస్తున్న గజేందర్
- ప్రభుత్వ ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి ప్రవేశం
- నిజాయితీ నిబద్ధతతో పార్టీకి అంకితమైన గజేందర్
- కాంగ్రెస్ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేద్దాం

06

# శంషాబాద్‌లో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా...!

**కె. శ్రీనివాసరావు, స్టేట్ బ్యూరో చీఫ్, మహా డైలీ :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్ ఆర్ ఓ శంషాబాద్ 1520) కేంద్రంగా ఓ భారీ అక్రమ రిజిస్ట్రేషన్ల కుంభకోణం వెలుగుచూసింది. జంట జాలాశయాలైన ఉస్మాన్, హిమాయత్ సాగర్ ల నుండి జంట నగరాలకు త్రాగు నీరు అందించేందుకు, పర్యావరణ పరిరక్షణ కోసం ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ సి.అర్జున్ రావు నేతృత్వంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జీఓ 111 నిబంధనలకు తూట్లు పొడుస్తూ రియల్ మాఫియా పెట్రేగి పోతోంది. ఈ జీ ఓ 111 ప్రకారం జంట జాలాశయాలకు 10 కిలోమీటర్ల పరిధిలోని 84 గ్రామాల్లో ఎలాంటి లేఅవుట్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు, చెక్ డ్యామ్ లు, కాంక్రీట్ వాల్స్ చేపట్టకూడదనే నిషేధాజ్ఞలను తుంగలో తొక్కి, నాలా కన్వర్షన్ అనే ప్రాథమిక ప్రక్రియను సైతం గాలికొదిలేసి కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి విల్లాలు, కట్టడాలు లేకపోయినా.. కాగితాలపై మాత్రం 84 విల్లాలు ఉన్నట్లు సృష్టించి యథేచ్ఛగా సాగించిన ఈ అక్రమ రిజిస్ట్రేషన్ల పర్వం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపుతోంది.

**కళ్లు బైర్లు కమ్మే లావాదేవీలు .. అసలు ఏం జరిగింది**

వివరాలలోకి వెళ్తే శంషాబాద్ మండలం తొండుపల్లి గ్రామ పరిధిలో జరిగిన ఈ వ్యవహారానికి సంబంధించిన అధికారిక రిజిస్టర్డ్ డాక్యుమెంట్, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికేట్ లోని వివరాలు పరిశీలిస్తే అధికారుల సాహసం ఎంతటిదో అర్థమవుతుంది. ఈ ఏడాది జనవరి 7, 2026 న (07012026) శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నంబర్ 197/2026 తో ఒక డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కమ్ జీపీఏ రిజిస్టర్ అయింది. తొండుపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 211/ఈఈ/1, 211/ఈఈ/2, 212/రు/1/1/1/1/1/1/1, 212/రు/1/1/2, 212/రు/1/1/1/2 సహా పలు సబ్‌డివిజన్లలో విస్తరించి ఉన్న 26,124 చదరపు గజాల భూమిని ఈ డీడ్ పరిధిలోకి తెచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖ రికార్డుల ప్రకారమే ఈ స్థలం యొక్క అధికారిక మార్కెట్ విలువ అక్షరాలా రూ. 41,68,16,400 (41.68 కోట్లు). కాగా దీని కన్సిడరేషన్ వాల్యూను రూ. 41,68,17,000 గా చూపించారు. బహిరంగ మార్కెట్లో దీని విలువ వందల కోట్లకు పైనే ఉంటుందని అంచనా. ఈ వివాదాస్పద రిజిస్ట్రేషన్‌కు బేస్‌గా దాదాపు 43 ఏళ్ల హిస్టరీని (1983 నుండి 2026 వరకు) పరిశీలిస్తూ పాత లింక్ డాక్యుమెంట్లను జత చేశారు. ఇందులో ప్రధానంగా 1996 నాటి పాత సేల్ డీడ్లు (డాక్యుమెంట్ నంబర్లు: 1900/1996, 1899/1996) తో పాటు, 2015, 2016, 2017 లో జరిగిన అంతర్గత కుటుంబ సెటిల్‌మెంట్లు, సేల్ డీడ్లను (డాక్యుమెంట్లు: 6205/2015, 3357/2016, 5015/2016, 116/2017) లింక్‌లుగా చూపిస్తూ అత్యంత చాకచక్యంగా చట్టబద్ధత కల్పించారు. ఈ భారీ భూ ఒప్పందంలో ఎగ్జిక్యూటెంట్లుగా రాకేష్ కుమార్ అలియాస్ రాకేష్ గార్గ్, సంజయ్ కుమార్, నంద్ కిషోర్ అగర్వాల్, అశోక్ కుమార్ గార్గ్ వ్యవహరించగా.. ల్యాండ్‌ను దక్కించుకున్న క్లెయిమెంట్‌గా ఎమ్/ఎస్. ఆర్కే మైత్రి సంస్థ నిలిచింది. ఆ సంస్థ తరఫున మేనేజింగ్ భాగస్వాములుగా రాపోలు కృష్ణకుమారి, డాక్టర్ ప్రకాష్ బాబు వేగుంట సంతకాలు చేశారు.




**జీహెచ్‌ఎంసీ అధికారుల 'చేతివాటం'..**
**లేని విల్లాలకు నంబర్లు జారీ**

ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలతో పాటు జీహెచ్‌ఎంసీ క్షేత్ర స్థాయి సిబ్బంది (బిల్ కలెక్టర్)తో పాటు డిప్యూటీ కమిషనర్ వరకు సమానంగా పాపంలో పాలు పంచుకున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ 26124 వేల చదరపు గజాల స్థలంలో ఏకంగా 3,78,924 చదరపు అడుగుల బిల్టప్ ఏరియా ఉన్నట్లు డాక్యుమెంట్‌లో పొందు పరిచారు. అంతేకాకుండా.. ప్లాట్ నంబర్ 1 నుండి 84 వరకు విల్లాలు ఉన్నట్లు చూపిస్తూ, వీటికి హౌజ్ నంబర్లు 281/1/A1 నుండి 281/84/A1 వరకు కేటాయించారు.అసలు క్షేత్రస్థాయిలో పునాది రాయి కూడా పడలేదు, కనీసం ఇటుక కూడా పెట్టలేదు.. మరి అలాంటప్పుడు జీహెచ్‌ఎంసీ అధికారులు వీటికి ప్రాపర్టీ టాక్స్ అసెస్‌మెంట్ నంబర్లు (పి టి ఐ ఎన్ ), డోర్ నంబర్లు ఏ రికార్డుల ఆధారంగా కేటాయించారనేది మిస్టరీగా మారింది. కేవలం రిజిస్ట్రేషన్ సులభం చేయడం కోసమే జీహెచ్‌ఎంసీ అధికారులు భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని ఈ నంబర్లు కేటాయించినట్లు స్పష్టమవుతోంది.

**డాక్యుమెంట్ నంబర్ 197/2026 సూత్రధారి**
**జూనియర్ అసిస్టెంట్ నజీరుద్దీన్.. అండగా**
**ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డి!**

ఈ భారీ స్కామ్ వెనుక సూత్రధారి, పాత్రదారి శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న 'నజీరుద్దీన్' కీలక పాత్ర పోషించినట్లు కార్యాలయ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం రాకూడని ఫైళ్లను టేబుల్ దాటించడంలో నజీరుద్దీన్ సిద్ధహస్తుడని, ఆయనకు ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డి పూర్తిస్థాయిలో సహకరించారని సమాచారం. వీరిద్దరికీ తోడుగా, రిజిస్ట్రేషన్ల శాఖలో బలమైన పట్టున్న ఒక టీఎన్‌జీఓ సంఘం అగ్రనేత బ్యాక్‌బోన్‌గా నిలిచారని, ఉన్నతాధికారుల నుండి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆయనే మేనేజ్ చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై స్థానిక సామాజిక కార్యకర్తలు ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డిని నిలదీయగా.. "మేము కావాలని చేయలేదు, స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అనుచరులు ఒత్తిడి తెస్తేనే ఈ రిజిస్ట్రేషన్ చేయాల్సి వచ్చింది" అంటూ నోరు జారడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర కలకలం రేపుతోంది.

**ఏసీబీ, విజిలెన్స్ విచారణకు స్థానికుల డిమాండ్:**

ప్రభుత్వ నిబంధనలను, పర్యావరణ చట్టాలను తుంగలో తొక్కి, నాలా కన్వర్షన్ ఫీజులు ఎగ్గొట్టి, లేని విల్లాల పేరిట జీహెచ్‌ఎంసీ పి టి ఐ ఎన్, ఇంటి నంబర్లతో సాగిన ఈ భారీ కుంభకోణంలో వందల కోట్లు చేతులు మారాయని తొండుపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల కమిషనర్ తక్షణమే స్పందించి ఈ డాక్యుమెంట్ నంబర్ 197/2026 పై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగితే శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత సంవత్సరం డిసెంబర్ నుండి ఈ సంవత్సరం జనవరి 17 వరకు జరిగిన రిజిస్టర్డ్ డాకుమెంట్స్ ని పరిశీలిస్తే మరిన్ని అక్రమ రిజిస్ట్రేషన్లు బయటపడే అవకాశముందని వారు స్పష్టం చేస్తున్నారు.


మహా
శంషాబాద్‌లో అక్రమ
రిజిస్ట్రేషన్ల దందా!
మహా
శంషాబాద్‌లో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా!


FIFTY RUPEES
Rs.50
INDIA NON JUDICIAL
TELANGANA
DEVELOPMENT AGREEMENT CUM IRREVOCABLE GENERAL POWER OF ATTORNEY


After obtaining permission, the Parties of the First Party Nos. 1 and 2 committed to develop the project. Subsequently, the Parties of the First Party Nos. 3 and 4 were also continuing the required to continue the development using their own funds. Construct independent Houses and Concerned authority have allotted each permission have independent house number and sanctioned plan of entire houses of above said land and allocation of house number of individual as follows:-

| VILLA NO | HOUSE NO. | PTIN NO | SQ. YARDS | SQ.FEETS |
|---|---|---|---|---|
| 1 | 2-81/1/A1 | 1199601391 | 311 | 4511 |
| 2 | 2-81/2/A1 | 1199601392 | 311 | 4511 |
| 3 | 2-81/3/A1 | 1199601393 | 311 | [illegible] |
| 4 | 2-81/4/A1 | 1199601394 | 311 | [illegible] |
| 5 | 2-81/5/A1 | 1199601395 | 311 | 4511 |
| 6 | 2-81/6/A1 | 1199601396 | 311 | [illegible] |
| 7 | 2-81/7/A1 | 1199601397 | 311 | 4511 |
| 8 | 2-81/8/A1 | 1199601398 | 311 | 4511 |
| 9 | 2-81/9/A1 | 1199601399 | 311 | [illegible] |
| 10 | 2-81/10/A1 | 1199601400 | 311 | [illegible] |
| 11 | 2-81/11/A1 | 1199601402 | 311 | [illegible] |
| 12 | 2-81/12/A1 | 1199601402 | 311 | [illegible] |
| 13 | 2-81/13/A1 | 1199601403 | 311 | [illegible] |
| 14 | 2-81/14/A1 | 1199601404 | 311 | 4511 |
| 15 | 2-81/15/A1 | 1199601415 | 311 | [illegible] |
| 16 | 2-81/16/A1 | 1199601416 | 311 | [illegible] |
| 17 | 2-81/17/A1 | 1199601417 | 311 | [illegible] |
| 18 | 2-81/18/A1 | 1199601418 | 311 | [illegible] |
| 19 | 2-81/19/A1 | 1199601419 | 311 | 4511 |


b) Dr. PRAKASH BABU VEGUNTA S/o Sri V.V.N. Prasad, Aged about: 62 Years, Occ : Doctor, R/o Flat No.1101, C Block, My Home Abhra Opposite Inorbit Mall, Gachibowli, Serilingampally, R.R. District, T.G. (Aadhaar [redacted]

"Hereinafter referred to as "DEVELOPER" which term unless repugnant to the context shall mean and include all its partners, legal representatives, heirs, executors, administrators, successors-in-office & interest, assignees and nominees etc., of the SECOND PART".

## ఏపీ మద్యం రవాణా స్కామ్

**( మొదటి పేజీ తరువాయి )**

తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. కుంభకోణం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.195.33 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. సిగ్మా, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు మద్యం రవాణాలో అక్రమాలు జరిగినట్లు.. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్‌కు కాంట్రాక్టులు ఇప్పించేందుకు రూ.28 కోట్ల ముడుపులు తీసుకున్నట్లు అధికారులు ఆధారాలు సేకరించారు. రవాణా ద్వారా వచ్చిన ఆదాయంలో 96 శాతం సిండికేట్ ఖాతాలకు వెళ్లగా.. సిగ్మా సంస్థకు 4 శాతం ముడుపులు మళ్లించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఇటీవల కారుమూరి నాగేశ్వరరావు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. జూలై 29న ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ స్కామ్ విలువ రూ.350 కోట్లకు పైగా ఉందని వ్యాఖ్యానిస్తూ, కస్టోడియల్ విచారణ అవసరమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు కారుమూరిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

## ఖర్గేను కలిసిన కొండా సురేఖ
# బెంగళూరులో భేటీ

**ఎయిర్ పోర్ట్ లో బిజెపి చీఫ్ తో ముచ్చట**

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ను కలవడం ఆసక్తికరంగా మారింది. ఆదివారం మధ్యాహ్నం బెంగళూరులో ఖర్గేతో సురేఖ భేటీ అయ్యారు. సుమారు 15 నిమిషాల పాటు వీరి సమావేశం కొనసాగింది. కొండా సురేఖ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఖర్గేకు వివరించినట్లు తెలుస్తోంది. కూతురు వ్యాఖ్యలు, ఆ తర్వాత పరిణామాల గురించి ఆమె ఖర్గేకు వివరించారు. కొండా సురేఖ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల అపాయింట్ మెంట్ కోరినా ఎవరూ స్పందించకపోవడంతో నేరుగా ఖర్గేను కలిశారు. ఈ సందర్భంగా ఖర్గే సుస్మిత వ్యాఖ్యలపై ఆరా తీశారు. పార్టీకి నష్టం కలిగించే విధంగా మాట్లాడటం సరికాదని కొండా సురేఖకు సూచించారు. కొండా సురేఖ బెంగళూరు పర్యటనలో మరో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఎయిర్ పోర్ట్‌లో కొండా సురేఖ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుకు తారసపడ్డారు. ఈ క్రమంలో ఆమె బెంగళూరు పర్యటన గురించి రామచందర్ రావుతో చెప్పుకున్నట్లు తెలుస్తోంది. ఒక వైపు సురేఖకు సొంత పార్టీ నేతల నుంచే తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈ సమయంలో ఆమె ఖర్గేను కలవడం, బీజేపీ నేతలతో తన వ్యక్తిగత పర్యటన వివరాలు షేర్ చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



## ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ వ్యూహాలు

**నేడు మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం, మీనాక్షి నటరాజన్ జూమ్ సమావేశం**

**హైదరాబాద్, మహా:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పై తెలంగాణ కాంగ్రెస్ మరింత దృష్టి సారించింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ కలిసి సోమవారం సాయంత్రం 5.30 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలతో జూమ్ సమావేశం నిర్వహించనున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించే అవకాశం ఉంది. ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడడం, కొత్తగా అర్హత పొందినవారిని జాబితాలో చేర్పించడం, బూత్ స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం వంటి అంశాలు సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ గత కొంతకాలంగా ఎస్ఐఆర్ ప్రక్రియను రాజకీయంగా కీలక అంశంగా పరిగణిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసి ఓటర్ల జాబితాను పరిశీలించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర ఎన్నికల ప్రక్రియల నేపథ్యంలో ఓటర్ల జాబితా ప్రాధాన్యం మరింత పెరిగింది.



# నిజామాబాద్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం

**టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**

**నిజామాబాద్, మహా :** జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే నిజామాబాద్ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో తెలంగాణ యూనివర్సిటీ, కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో మెడికల్ కాలేజీలు వచ్చాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంజినీరింగ్, వ్యవసాయ కళాశాలలను తీసుకొచ్చామని, ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయని చెప్పారు. లింబాద్రి గుట్టపై గెస్ట్‌హౌస్ నిర్మాణం చేపడుతున్నామని, రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు నిజామాబాద్ జిల్లాకు మంజూరయ్యాయని తెలిపారు. హైదరాబాద్ తరహాలో నిజామాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో పాటు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించామని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. సహకార సంఘాల్లో పార్టీ కోసం కష్టపడ్డ వారికి పదవులు కల్పిస్తామని తెలిపారు. నిజామాబాద్ మాస్టర్ ప్లాన్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించినట్లు వెల్లడించారు. బీజేపీ నేతలు నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా కూడా అభివృద్ధి చేయలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. కొందరు నేతలు సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆర్మూర్‌లో పామాయిల్ పరిశ్రమ రాబోతుందని, వ్యవసాయ రంగంలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే మేటి జిల్లాగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, నగేష్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ తాహెర్బిన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్'గా రాహుల్ గాంధీ

**ఆన్ లైన్ లో వైరల్**
**కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల పోస్టర్లు**

**ఢిల్లీ, మహా :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని "రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్"గా చిత్రీకరిస్తూ జాతీయ రాజధానిలోని భారత జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో రాహుల్ గాంధీ చిత్రంతో పాటు "ది సైలెంట్ గార్డియన్, ఎ వాచ్‌ఫుల్ ప్రొటెక్టర్, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్" అనే ట్యాగ్‌లైన్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల ప్రారంభంలో రాహుల్ గాంధీ ఇన్‌స్టాగ్రామ్‌లో విద్యార్థులు, యువ పౌరులతో 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి సరదాగా "మీరు బ్యాట్ మ్యాన్ ఆ?" అని ప్రశ్నించారు. దీనికి రాహుల్ స్పందిస్తూ, "బ్యాట్ మ్యాన్, తాను ఒకే గదిలో ఎప్పుడూ లేమని అందరూ అనుకుంటున్నారులే" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. రాహుల్ గాంధీ చేసిన ఈ సరదా వ్యాఖ్య ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది.




విద్యార్థులు దీనిపై పలు మీమ్స్‌ను రూపొందించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల ఆయనను 'రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్'గా పేర్కొంటూ పోస్టర్లు ఏర్పాటు చేశారు.

# జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు



**వరంగల్ - ఖమ్మం గ్రాడ్యుయేట్ స్థానం నుండి పోటీ**

**వరంగల్ బ్యూరో మహా ;** ఉమ్మడి ఖమ్మంనల్లగొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థిగా మాజీ హెల్త్ డైరెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం కు చెందిన డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును ముందస్తుగా ప్రకటించింది. ప్రస్తుతం ఆయన జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆరోగ్యశాఖలో ఉన్నతస్థాయిలో పనిచేసిన ఆయనకు వైద్య రంగంలో సేవలందించిన అనుభవం ఉంది. జనసేన జాతీయ కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ .. గడల శ్రీనివాసరావు పేరును పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కు ప్రతిపాదించారు. ఆయన అభ్యర్థిత్వానికి పవన్ కల్యాణ్ సుముఖత వ్యక్తం చేయడంతో పార్టీ ముందస్తుగా పేరును ప్రకటించినట్లు జనసేన వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత, విద్యావంతులు, మేధావులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపిస్తానన్నారు. వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. మూడు ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు తనకు ఆశీస్సులు అందించాలని కోరారు.తన పై నమ్మకంతో అభ్యర్థిగా ప్రకటించిన పవన్ కల్యాణ్, రామ్ తాళ్లూరి, శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల మద్దతుతో ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుచుకుని తెలంగాణలో జనసేన పార్టీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# జనసేనలోకి కొండా సుస్మిత?

**నేడు నేతలతో భేటీ ప్రచారం**

**హైదరాబాద్, మహా :** జనసేనలోకి కొండా సుస్మిత వెళ్ళనుందనే ప్రచారం జోరందుకుంది. సోమవారవ జనసేన కీలక నేతలతో కొండా సుస్మిత భేటీ అవనుందని చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై సుస్మిత చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారగా, మంత్రి కొండా సురేఖపై కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండా తెగదెంపులకు సిద్ధపడే కూతురికి మద్దతుగా నిలుస్తోందని, గతంలోనే ఇలాంటి వ్యాఖ్యలు రిపీట్ కావని చెప్పి ఇపుడు సీఎం టార్గెట్ గా విమర్శలు చేయడంపై పార్టీలో ఎవరూ అంగీకరించడం లేదు. దీంతో ముందుగా తనకు, తన తల్లికి సంబంధం లేదని చెప్పేందుకు జనసేన నేతలతో భేటీ వ్యూహం ఎంచుకున్నట్లు చెబుతున్నారు.



# కాంగ్రెస్ 1000రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి



**హైదరాబాద్, మహా :** అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి.. వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి.. తర్వాత అన్నివర్గాల ప్రజలను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి 1,000 రోజులు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యాచరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా వచ్చే నెల 2 నుంచి వారం రోజులపాటు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున వినూత్నంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో చేసిన మోసాలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి చేరేలా ఈ వారం రోజుల కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేలా కార్యాచరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అర్ధరాత్రి నుంచి ఆటో.. క్యాబ్.. స్కూల్ వ్యాన్ల బంద్

**ఎన్నికల హామీలు అమలు చేయలేదంటూ 18 సంఘాల జేఏసీ ఆగ్రహం.**

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల ఆందోళన తీవ్రరూపం దాల్చింది. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ఆరోపిస్తూ 18 సంఘాలతో కూడిన జేఏసీ ఆదివారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ బంద్ సోమవారం కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్లు నిలిచిపోవడంతో సాధారణ రవాణాపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో రోజువారీ ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని, ఆటో, క్యాబ్, ప్రైవేటు రవాణా కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



# తిరుమలలో భక్తుల రద్దీ

- 22 కంపార్టుమెంట్లలో వేచిచూపులు
- సర్వదర్శనానికి ఎనిమిది గంటలు.
- ఒక్కరోజే 84,873 మంది దర్శనం

**తిరుమల, మహా.:** తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. వారాంతం కావడంతో కొండపైకి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 22 కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు ఎనిమిది గంటల సమయం పడుతున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వర్గాలు వెల్లడించాయి. దర్శనం కోసం వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లలో తాగునీరు, అన్నప్రసాదం, వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.
శనివారం శ్రీవారిని 84,873 మంది భక్తులు దర్శించుకున్నారు. 36,286 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ద్వారా రూ.3.67 కోట్ల ఆదాయం సమకూరింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తిరుమలలో ఆగస్టు 23 నుంచి 25 వరకు వార్షిక పవిత్రోత్సవాలు కూడా జరగనున్నాయి. ఆగమ సంప్రదాయాల ప్రకారం నిర్వహించే ఈ ఉత్సవాలకు సంబంధించి టీటీడీ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది.ప్రస్తుతం దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్యలో రోజువారీ హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ వారాంతాలు, పర్వదినాలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలో రద్దీ ఒక్కసారిగా పెరగడం సాధారణంగా మారింది. దీంతో టోకెన్ లేని భక్తులకు వేచి ఉండే సమయం కూడా పెరుగుతోంది. భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి క్యూలైన్లను క్రమబద్ధీకరించడం, కొండపై వసతి, రవాణా, అన్నప్రసాదం తదితర సౌకర్యాలను సమన్వయం చేయడం టీటీడీకి కీలకంగా మారింది. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు రద్దీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రయాణ ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

- 'సేవా సంకల్ప్ అభియాన్'ను ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలి: పొంగులేటి సుధాకర్‌రెడ్డి.



**ఢిల్లీ, మహా :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరిపాలనా బాధ్యతలు చేపట్టి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన్'ను ప్రజాసేవ, సుపరిపాలన, అభివృద్ధి, అంత్యోదయ స్ఫూర్తిని ప్రతిబింబించే మహత్తర ప్రజా ఉద్యమంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు-కర్ణాటక జాతీయ సహ ఇన్‌చార్జి డా. పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో జరిగిన విస్తృత స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశంలో ఈ కార్యక్రమ కార్యాచరణపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రధానమంత్రిగా దేశానికి నాయకత్వం వహిస్తున్న నేటి వరకు మోదీ రాజకీయ ప్రస్థానానికి సేవ, సుపరిపాలన, అభివృద్ధి, అంత్యోదయమే మూలస్తంభాలుగా నిలిచాయని సుధాకర్‌రెడ్డి అన్నారు. గుజరాత్ నుంచి ఢిల్లీ వరకు ఆయన ప్రయాణం కేవలం పదవుల ప్రస్థానం కాదని, లభించిన ప్రతి బాధ్యతను ప్రజాసేవకు సాధనంగా మార్చిన 25 ఏళ్ల తపస్సు అని పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తికీ అభివృద్ధి ఫలాలు అందాలన్న సంకల్పమే ఆయన పాలనా విధానానికి ఆత్మ అని వివరించారు.సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు జరిగే అభియాన్‌లో యువత, మహిళలు, రైతులు, కార్మికులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, వృత్తి నిపుణులతో పాటు సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యం, లబ్ధిదారులతో ప్రత్యక్ష సంప్రదింపులు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు మోదీ నాయకత్వంలో దేశంలో చోటుచేసుకున్న మార్పులను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు.
దేశ పరివర్తన కథను కొత్త తరానికి వాస్తవాలు, గణాంకాలు, లబ్ధిదారుల అనుభవాలు, ప్రజాసేవ ద్వారా తెలియజేయాల్సిన అవసరం ఉందని సుధాకర్‌రెడ్డి అన్నారు. పేదల జీవితాల్లో పాలన తీసుకొచ్చిన మార్పు, మౌలిక సదుపాయాల విస్తరణ, పేదరిక నిర్మూలన, ప్రపంచ వేదికపై భారత్ స్థానం బలోపేతం వంటి అంశాలను యువతకు వివరించాల్సి ఉందన్నారు. రాజకీయాలు అంటే కేవలం అధికారం కాదని, సేవ, బాధ్యత, దేశ నిర్మాణం అనే భావనను యువతలో బలపరిచే కార్యక్రమంగా 'సేవా సంకల్ప్ అభియాన్' నిలవాలని ఆకాంక్షించారు.

**రాహుల్, ఖర్గేలకు ఘాటు కౌంటర్**

కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే రాజకీయ వైఖరిపై సుధాకర్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల్లో ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల అనుమానాలు, అపనమ్మకాలు పెంచేలా కాంగ్రెస్ నాయకత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే బీజేపీ లక్ష్యమని, అభివృద్ధి, ఆకాంక్షలు, అవకాశాలపై తాము మాట్లాడుతుంటే కాంగ్రెస్ ఆరోపణలు, ప్రతికూలత, రాజకీయ అనుమానాల చుట్టూ తిరుగుతోందని విమర్శించారు.ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష హక్కు మాత్రమే కాక ప్రజాస్వామ్యానికి అవసరమని, అయితే ప్రభుత్వంపై రాజకీయ వ్యతిరేకత దేశంపై నిరంతర నిరాశావాద ప్రచారంగా మారకూడదని అన్నారు. రాహుల్‌గాంధీకి మోదీని రాజకీయంగా వ్యతిరేకించే స్వేచ్ఛ ఉందని, కాంగ్రెస్‌కు బీజేపీని ప్రశ్నించే హక్కు ఉందని పేర్కొంటూనే, ప్రతి వ్యవస్థపైనా అనుమానాలు సృష్టించడం, అర్ధసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయదని వ్యాఖ్యానించారు.

**అభివృద్ధిపై చర్చకు రావాలి**

కాంగ్రెస్ నాయకత్వానికి సుధాకర్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మౌలిక సదుపాయాలు, ఆర్థిక సమ్మిళితం, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం, తాగునీరు, ఆరోగ్యం, డిజిటల్ విప్లవం, మహిళా సాధికారత, జాతీయ భద్రత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై కాంగ్రెస్ తన రికార్డును, బీజేపీ తన రికార్డును ప్రజల ముందు ఉంచాలని సూచించారు. తుది తీర్పును ప్రజలకే వదిలేద్దామని అన్నారు.
ప్రతిపక్షం తన రాజకీయ శక్తిని ఒక వ్యక్తిని వ్యతిరేకించడానికే వినియోగిస్తుంటే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన శక్తినంతా 140 కోట్ల మంది భారతీయుల సేవకు అంకితం చేస్తున్నారని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతికూల రాజకీయాలకు తమ సమాధానం సేవ అని, తప్పుడు ప్రచారానికి వాస్తవాలే సమాధానమని, విభజన రాజకీయాలకు 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్'తో జవాబిస్తామని స్పష్టం చేశారు.
సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు జరిగే 'సేవా సంకల్ప్ అభియాన్'లో బీజేపీ కార్యకర్తలతో పాటు ప్రజలు, ముఖ్యంగా యువత పెద్దఎత్తున భాగస్వాములు కావాలని సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'సేవ-సంకల్పం-ప్రజా భాగస్వామ్యం' స్ఫూర్తితో ఈ నెల రోజుల కార్యక్రమాన్ని వికసిత్ భారత్ @2047 లక్ష్య సాధన దిశగా మహత్తర ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్‌లో లేఖల కలకలం

- క్రమశిక్షణ కమిటీకి కొండా సురేఖ మరో లేఖ.
- మళ్లీ భేటీ కానున్న కమిటీ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం మరింత ముదురుతోంది. పార్టీ క్రమశిక్షణ కమిటీకి ఆమె మరో లేఖ రాశారు. ఇప్పటికే ఆమె నుంచి ఒక వివరణ అందగా తాజాగా రెండో లేఖ కూడా రావడంతో వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. రెండు లేఖలను పరిశీలించి కమిటీ తదుపరి సమావేశంలో చర్చిస్తామని కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. కొండా సురేఖ తనపై, తన కుటుంబంపై కొందరు పార్టీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తనపై జరుగుతున్న ప్రచారం వెనుక అదృశ్య శక్తులు ఉన్నాయన్న అనుమానాన్ని ఆమె వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై నిష్పాక్షికంగా విచారణ జరిపి అసలు కారణాలను గుర్తించాలని ఆమె పార్టీ క్రమశిక్షణ కమిటీని కోరినట్లు తెలుస్తోంది.ఇదే సమయంలో మంత్రి సురేఖ కుటుంబానికి సంబంధించిన వ్యాఖ్యలు, పార్టీ నాయకుల మధ్య పరస్పర ఆరోపణలు కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలను బహిర్గతం చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఈ వ్యవహారం మరింత వేడెక్కడం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. క్రమశిక్షణ కమిటీ వివిధ నేతల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వీడియోలు, వివరణలను పరిశీలిస్తోంది.కమిటీ తక్షణ చర్య తీసుకోకుండా మరింత సమాచారం సేకరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో కొండా సురేఖ, చిన్నారెడ్డి తదితరుల వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఉత్కంఠగా మారింది. పార్టీ వేదికలపైనే అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవాలన్న సందేశాన్ని నాయకత్వం ఇస్తున్నప్పటికీ, వరుసగా బయటకు వస్తున్న ఆరోపణలు కాంగ్రెస్ క్రమశిక్షణ వ్యవస్థకు సవాలుగా మారాయి.



# గచ్చిబౌలిలో అక్రమ నిర్మాణాలపై కొరడా

- సాజిద్‌ఖాన్ అరెస్టు.
- మరో ఆరు అంతస్తుల భవనంపై కూల్చివేతకు రంగం సిద్ధం.

**హైదరాబాద్, మహా.:** గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అక్రమ నిర్మాణాలకు సంబంధించి సాజిద్‌ఖాన్‌ను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. ఆయన నిర్మించినట్లు గుర్తించిన అక్రమ కట్టడాలపై హైడ్రా అధికారులు దృష్టి సారించారు. ఇదే సమయంలో మరో ఆరు అంతస్తుల భవనాన్ని కూల్చివేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేయడం గచ్చిబౌలి పరిణామాలకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. భారీ కూల్చివేత యంత్రాన్ని ఇప్పటికే ఘటనాస్థలికి తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారణ అయితే వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. కేవలం అక్రమ నిర్మాణదారులపైనే కాకుండా నిర్మాణాలకు అనుమతులు ఎలా లభించాయి? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్న సమయంలో సంబంధిత విభాగాలు ఎందుకు స్పందించలేదు? అనే ప్రశ్నలపైనా అధికార యంత్రాంగం దృష్టి సారించింది.గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్‌రామ్‌గూడ తదితర ప్రాంతాల్లో భారీ స్థాయిలో నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతున్న నేపథ్యంలో భవన అనుమతులు, భూ వినియోగ మార్పులు, నిర్మాణ నిబంధనల అమలుపై ప్రశ్నలు తరచూ తలెత్తుతున్నాయి. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే భవిష్యత్తులో రహదారులు, డ్రైనేజీ, పార్కింగ్, అగ్నిమాపక భద్రత వంటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. అక్రమ నిర్మాణాలకు సహకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరగనున్నట్లు సమాచారం. తాజా కూల్చివేతలు హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరికి సంకేతంగా కనిపిస్తున్నాయి.



# టాక్సిక్' వేడుకలో ప్రమాదం

- సౌండ్ సిస్టమ్ కూలి గాయాలు.. మల్లారెడ్డి యూనివర్సిటీ, నిర్వాహకులపై కేసు

**హైదరాబాద్, మహా.:** కన్నడ నటుడు యశ్ నటించిన 'టాక్సిక్' చిత్ర ప్రీరిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. భారీగా అభిమానులు, విద్యార్థులు తరలివచ్చిన కార్యక్రమంలో సౌండ్, లైటింగ్ ఏర్పాట్లకు సంబంధించిన నిర్మాణం కూలిపోవడంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అభిమానులు రావడంతో ప్రాంగణంలో జనసందోహం పెరిగింది. ఇదే సమయంలో సౌండ్ సిస్టమ్ నిర్మాణంలో భాగం కూలడంతో ప్రమాదం చోటుచేసుకుంది. నలుగురికి గాయాలైనట్లు నివేదికలు వెల్లడించాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు.ఈ ఘటనలో కార్యక్రమ నిర్వాహకులు, మల్లారెడ్డి యూనివర్సిటీ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. భారీ జనసందోహం ఉంటుందని ముందే తెలిసినప్పటికీ భద్రతా ఏర్పాట్లు, నిర్మాణాల స్థిరత్వం, అత్యవసర మార్గాలు, జన నియంత్రణ చర్యలు తగిన స్థాయిలో చేపట్టారా అనే అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.సినీ కార్యక్రమాలకు వేలాది మంది అభిమానులు తరలివస్తున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే చిన్నపాటి లోపం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని తాజా ఘటన మరోసారి స్పష్టం చేసింది. కార్యక్రమ నిర్వాహకుల బాధ్యత, విద్యాసంస్థ ప్రాంగణంలో భారీ వాణిజ్య కార్యక్రమాలకు అనుమతుల ప్రక్రియ, పోలీసుల సమన్వయం వంటి అంశాలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

# బంగాళాఖాతంలో 'ఓషన్ విన్నర్' మునక

- 24 మంది సిబ్బందిలో ఇద్దరి రక్షణ.
- మిగిలిన 22 మంది కోసం నేవీ గాలింపు

**విశాఖపట్నం, మహా.:** బంగాళాఖాతంలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ సరకు నౌక 'ఎంవీ ఓషన్ విన్నర్' మునిగిపోవడంతో భారీ స్థాయి గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉండగా ఇద్దరిని రక్షించారు. మిగిలిన 22 మంది కోసం భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్ సంయుక్తంగా గాలింపు చేపడుతున్నాయి.ఒడిశాలోని పారాదీప్ నుంచి ఇనుప ఖనిజంతో చైనా వైపు వెళ్తున్న నౌక నుంచి అత్యవసర సందేశం రావడంతో భారత భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. అనంతరం నౌకతో సంబంధాలు తెగిపోయాయి. సముద్రంలో నౌక మునిగిపోయినట్లు నిర్ధారణ కావడంతో రెస్క్యూ ఆపరేషన్‌ను వేగవంతం చేశారు.నౌకలో 20 మంది చైనా పౌరులు, ముగ్గురు మయన్మార్ పౌరులు, ఒక బంగ్లాదేశ్ పౌరుడు ఉన్నట్లు సమాచారం. రక్షించిన ఇద్దరికి వైద్యసాయం అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో నౌకాదళ నిఘా విమానాలు, నౌకలు, కోస్ట్‌గార్డ్ బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. సమీపంలోని వాణిజ్య నౌకలను కూడా సహాయక చర్యల్లో భాగస్వామ్యం చేయాలని కోరారు.సముద్రంలో వాతావరణ పరిస్థితులు, అలల తీవ్రత, నౌక మునిగిన లోతు రెస్క్యూ ఆపరేషన్‌కు సవాలుగా మారుతున్నాయి. అయినప్పటికీ ప్రాణాలతో ఉన్నవారిని గుర్తించి రక్షించడమే ప్రధాన లక్ష్యంగా నేవీ, కోస్ట్‌గార్డ్ బృందాలు పనిచేస్తున్నాయి. ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది సహాయక చర్యలు పూర్తయిన తర్వాత దర్యాప్తులో తేలనుంది.





# మోదీ@25'పై బీజేపీ మథనం

- రాష్ట్రాల అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలతో వరుస సమావేశాలు.
- దేశవ్యాప్త ప్రచారానికి ప్రణాళిక.

**ఢిల్లీ,మహా.:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమాలకు బీజేపీ సిద్ధమవుతోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో కొత్తగా నియమితులైన జాతీయ కార్యవర్గంతో సమావేశాలు నిర్వహిస్తున్న పార్టీ, రాష్ట్రాల అధ్యక్షులు, సంస్థాగత ఇన్‌ఛార్జిలతోనూ చర్చలు జరుపుతోంది. మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా సాగించిన 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. మోదీ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో ప్రారంభమైన ఆయన పాలనా ప్రస్థానం 2014లో ప్రధానమంత్రి పదవికి చేరింది. అప్పటి నుంచి వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ నాయకత్వాన్ని పార్టీ తన ప్రధాన రాజకీయ బలంగా ప్రదర్శిస్తోంది. మౌలిక వసతులు, డిజిటల్ పాలన, సంక్షేమ పథకాలు, విదేశాంగ విధానం, రక్షణ, అంతరిక్షం, ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రచారంలో ప్రధాన అంశాలుగా తీసుకురావాలని పార్టీ భావిస్తోంది.ఇదే సమయంలో రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, 2029 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపైనా బీజేపీ దృష్టి సారిస్తోంది. యువతతో అనుసంధానం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణ, సామాజిక మాధ్యమాల ప్రచారం, బూత్ స్థాయి వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు సమావేశాల్లో చర్చకు వస్తున్నాయి. 'మోదీ@25'ను కేవలం వార్షికోత్సవ కార్యక్రమంగా కాకుండా దీర్ఘకాలిక రాజకీయ ప్రచారంగా మలచాలని పార్టీ యోచిస్తున్నట్లు సమాచారం. దేశంలోని ప్రతి రాష్ట్రంలో మోదీ పాలనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా చేరాయన్నదాన్ని వివరించేందుకు ప్రణాళికలు రూపొందుతున్నాయి.

# చిన్నారెడ్డి వివరణపై మేఘారెడ్డి అసంతృప్తి

- ఆడియో, వీడియో ఆధారాలు కమిటీకి ఇచ్చా. చర్యలు తప్పవు: ఎమ్మెల్యే



హైదరాబాద్, మహా.: కాంగ్రెస్‌లో కొనసాగుతున్న అంతర్గత వివాదానికి మరో మలుపు తిరిగింది. చిన్నారెడ్డి ఇచ్చిన వివరణపై తాను సంతృప్తి చెందలేదని వనపర్తి ఎమ్మెల్యే టి. మేఘారెడ్డి తెలిపారు. చిన్నారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై పార్టీ చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు.తాను క్రమశిక్షణ కమిటీకి ఆడియో, వీడియో ఆధారాలను సమర్పించినట్లు మేఘారెడ్డి వెల్లడించారు. కమిటీ మరోసారి తనను పిలిస్తే పూర్తి వివరాలతో తన వాదనను వినిపిస్తానన్నారు. చిన్నారెడ్డి వివరణలో వాస్తవాలు లేవని, మొత్తం అబద్ధాలేనని ఆయన తీవ్రంగా ఆరోపించారు. చిన్నారెడ్డి బీఆర్‌ఎస్ నేతలతో సన్నిహితంగా ఉంటున్నారని కూడా మేఘారెడ్డి ఆరోపించారు. ఈ వివాదం ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి వెళ్లింది. మేఘారెడ్డి పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గేకు ఫిర్యాదు చేసినట్లు కూడా సమాచారం.మరోవైపు చిన్నారెడ్డి తనపై వచ్చిన క్రమశిక్షణ నోటీసును ఉపసంహరించుకోవాలని పార్టీ కమిటీని కోరినట్లు సమాచారం. తాను దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో ఉన్నానని, తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చినందున వ్యవహారాన్ని ముగించాలని ఆయన కోరారు. ఇద్దరి మధ్య విభేదాలు బహిరంగ స్థాయికి చేరడంతో పార్టీ నాయకత్వం ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయం ఈ వివాదానికి ముగింపు పలుకుతుందా? లేక మరింత రాజకీయ దుమారం రేపుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# ప్రాంక్ మెసేజ్‌తో బెట్టింగ్ ముఠా గుట్టురట్టు.

- 'నన్ను కిడ్నాప్ చేశారు' అంటూ ప్రియురాలికి మెసేజ్.
- పోలీసులకు రూ.30 లక్షల నగదు.

హైదరాబాద్, మహా.: ప్రియురాలికి ఓ యువకుడు చేసిన ప్రాంక్ మెసేజ్ చివరకు క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టును బయటపెట్టింది. తనను కిడ్నాప్ చేశారంటూ యువకుడు ప్రియురాలికి సందేశం పంపడంతో ఆమె ఆందోళనకు గురై 112కు ఫోన్ చేసింది. యువతి ఇచ్చిన సమాచారంతో పోలీసులు కేపీహెచ్‌బీలోని ఓ ఫ్లాట్‌కు చేరుకుని తనిఖీలు నిర్వహించగా సుమారు రూ.30 లక్షల నగదు లభించినట్లు సమాచారం. ఫ్లాట్‌లో మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరిశీలించగా క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన లావాదేవీలు, సమాచార మార్పిడి జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. నగదు కూడా బెట్టింగ్ కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.కిడ్నాప్ జరిగిందన్న సమాచారంతో పోలీసులు హుటాహుటిన స్పందించకపోయి ఉంటే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక వ్యక్తి చేసిన సరదా సందేశం పోలీసులను అనూహ్యంగా బెట్టింగ్ కేంద్రానికి తీసుకెళ్లింది.స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల్లోని సమాచారాన్ని విశ్లేషిస్తూ పోలీసులు ముఠాలోని ఇతర సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. బెట్టింగ్ నెట్‌వర్క్ ఎక్కడి నుంచి నడుస్తోంది? నగదు ఎవరికి చేరుతోంది? ఆన్‌లైన్ ఖాతాలు, బ్యాంకు లావాదేవీలు ఎలా సాగుతున్నాయి? అన్న కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. నగరంలో క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు నిఘా పెంచుతున్న సమయంలో ఈ ఘటన వెలుగులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 24-08-2026
సాహిత్యం నిర్వహణ హనీఫ్ 04

## మెలాన్ కోలీ

కాలాన్ని కుదువ పెట్టి
మేకలు కాసి
నూకలు బుక్కుతుంటాడు
కలాన్ని తాకట్టు పెట్టి
వాని వీపు వీడు
వీని వీపు వాడు గోకుతుంటాడు

ఆలోచనలను గిర్వీ పెట్టి
కుర్చీ నామస్మరణ
స్తోత్ర పఠన ఆలపిస్తుంటాడు

నిన్ను నీవు మార్టిగేజ్ చేసుకొని
రాను రాను గుర్రం గాడిద అయినట్టు
సగిలిస్తూ ఓండ్ర పెడుతుంటావు
నైతికత లేదు విలువలులేవు
గతి తప్పిన ఉపగ్రహంలా

ఏదో కథ కథోలె
పూట గడిస్తే చాలు

అస్తిత్వం ఆరాటం
వ్యక్తి బతుకు తెరువులోకి ఇంకిపోయింది
మేధావి పచ్చగున్న చోట తిని
వెచ్చగా ఉన్న కాడ పడుకుంటున్నాడు

విర్రవీగిన గ్రీకువీరుడు
ఒక చిన్న దోమ కుట్టి చచ్చిపోయాడు కానీ
"బూసే పాలస్" గుర్రం జాడ
ఇప్పటికీ దొరకలేదు

లౌక్యంతో ఎన్ని రోజులు ఈ సౌఖ్యం
ఉదయాలు అస్తమయాలు
ఎన్ని రోజులు కోల్డ్ స్టోరేజ్ లో ఉంటావు
నువ్వు ఇంకా మేల్కొననే లేదు

**జూకంటి జగన్నాథం**
**9441078095**

## చ్యుతి

సిందూరవర్ణపు సంజముసుగును కప్పుకుని
సూర్యుడు అస్తమించాడు
కానీ నువ్వది చూడలేదు
గాలిని మైకంతో నింపుతూ
ఉద్యానవనాల్లో గులాబీలు వికసించాయి
కానీ నువ్వు వాటిని అనుభూతించలేదు
వీధిలో ఒక పిల్లవాడు నిన్ను వేడుకున్నాడు
ఒక ముసలాయన ఇల్లు వదిలి పోయాడు
నువ్వు కనీసం దుఃఖించలేదు
కవాతు చేస్తున్న పదాతిదళాలకు జడిసి
జనం అటూయిటూ పరుగెత్తినప్పుడు
నువ్వు జులుంకు భయపడి మౌనంగా ఉండిపోయావు

మరణపు మహాద్వారం దగ్గర
మళ్లీ ఆ దృశ్యాలను చూశావు,
అనుభూతించావు, ఆక్రందించావు,
నిరాశతో బిగ్గరగా రోదించావు.
కానీ
ఒకప్పుడు ఎంతో దగ్గరగా ఉండిన జీవితం
కాయెకిన నిన్ను వీడింది

**ఆంగ్లమూలం: సర్గియో డినిజ్ ద కోస్టా**
**అనువాదం: ఎలనాగ**
**9866945424**

# విస్మృత కథకుడు నందగిరి




తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో సాహిత్యాన్ని సృజించిన అరుదైన ప్రతిభాశాలి నందగిరి వెంకటరావు. కథకుడిగా, నాటకకర్తగా, విమర్శకుడిగా, వ్యాసకర్తగా, ఆంధ్రమహాసభ కార్యకర్తగా, గ్రంథాలయోద్యమ నాయకుడిగా, జడ్జిగా, స్త్రీ విద్య ప్రచారకుడిగా ఆయన చేసిన కృషి అద్వితీయమైనది. తెలుగు సాహిత్యం ముఖ్యంగా కథానికా సాహిత్యం దేదీప్యమానంగా వెలగడానికి చమురునెంతో సరఫరా చేసిన మనీషి నందగిరి. దీపం కింది చీకటి లాగా ఆయన గురించి మనకంతగా తెలియదు. 1935లోనే అఖిలాంధ్ర కథకుల సమ్మేళనాన్ని నిర్వహించి తెలుగు కథను విస్తృతం చేశాడు.

19271936 సంవత్సరాల మధ్యకాలంలో భారతి, ఉదయినితో పాటు అనేక పత్రికల్లో 50కి పైగా కథలు వెలువరించి పాఠకుల, విమర్శకుల మన్ననలందుకున్న కథకుడు. చలంతో పాటుగా, ఆయనకు పోటీగా పత్రికా సంపాదకుల నుంచి, పాఠకుల నుంచీ సమానమైన అభిమానాన్ని పొందిన వాడు నందగిరి. మానవ సంబంధాలు, నైతిక విలువల్ని స్త్రీల కోణం నుంచి ఆవిష్కరించిండు. తెలంగాణ సాయుధ పోరాటానికి 15 యేండ్లకు ముందే దొరల, పటేండ్ల దౌర్జన్యాల్ని, వారి అకృత్యాలను ఎండగడుతూ 'సాయుధ మార్గమే' సరైన మార్గమని తన కథల్లో చెప్పిండు. హైదరాబాదు నుంచి పై చదువుల కోసం లండన్ వెళ్ళే వారి జీవితాలను, కష్టాలను, వేశ్యావృత్తిని, హిందూ ముస్లిం సంబంధాలను మానవీయ కోణంలో కథలుగా మలిచిండు. కథల్ని కత్తిగా మలిచి సమాజంలో మార్పు కోసం సనాతనులపై దాడికి దిగిన ధీరుడు నందగిరి [illegible]రెకటరావు.

'గిరి' అనే కలం పేరుతో నందగిరి వెంకటరావు రాసిన కథలు భారతి, ఉదయిని, కృష్ణాపత్రిక, సమదర్శిని, సుజాత, గోలకొండ లాంటి అనేక పత్రికల్లో అచ్చయ్యాయి. మొత్తం అఖిలాంధ్ర పాఠకుల ఆదరాభిమానాలు పొందిన మొట్టమొదటి తెలంగాణ కథకుడు నందగిరి అంటే అతిశయోక్తి కాదు. భారతి పత్రికలో అచ్చయిన తొలి తెలంగాణ కథ బహుశా నందగిరిదే కావచ్చు. ఆనాడు భారతి పత్రికలో కథ అచ్చుకావడమంటే కథకుడిగా తెలుగు సాహిత్యంలో గుర్తింపు లభించడమే. నందగిరి కథలు పదివరకు భారతిలో 193135 మధ్యకాలంలో అచ్చయ్యాయి. ఈ కాలంలో గుడిపాటి వెంకటచలం కథలు రాసినప్పటికీ ఆయన కథలు ఒక్కటి కూడా 'భారతి'లో చోటు చేసుకోలేదు. అయితే తెలంగాణ నుంచి 192730 మధ్యకాలంలో నడిచిన 'సుజాత' పత్రికలో చలం కథలు చాలా వెలువడ్డాయి.

కథానికా సాహిత్యంలో తనకంటూ ఒక శైలిని ఏర్పర్చుకొని లోచూపుతో విశ్లేషించి, మానవ సంబంధాల్ని, మానవీయ కోణంలో సున్నితంగా సృజించి జీవితాన్ని చిన్న కాన్వాస్‌పై కథగా చిత్రీకరించిన కథాకారుడు నందగిరి. ఈయన కథలన్నీ భిన్నమైన జీవితాల్ని ఆవిష్కరించాయి. 'జరిగిన కథ'లో చిన్నప్పుడు సఖ్యంగా ఉండి పెద్దైన తర్వాత కత్తులు దూసుకునేందుకు సిద్ధమైన హిందూముస్లింల కథను, హిందూ కథానాయకుడి మిత్రుడు సిద్దిఖీ, ఆయన సోదరి హుసేన్‌బీ తన మొగడి ద్వారా చిత్రహింసలకు గురికావడం సహించలేక ఆమెను కథానాయకుడు బొంబాయికి లేవదీసుకపోవడం ఇందులోని కథ. కథానాయకుడు కలకత్తాలో చదువుకోవడంతో అక్కడి మతఘర్షణలకు, హైదరాబాద్ ఘర్షణలకు పోలిక తీసుకొచ్చి చూపించిండు. 'ఇంద్ర' అనే మరో కథలో ఇంద్రావతి అనే మహిళ 'సామ్రాజ్యవాదం నశించాలి', ప్రజల హక్కుల గురించి, ప్రభుత్వం విధుల గురించి వాటిని సాధించుకోడానికి ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చి ఉద్యమం చేపట్టినందుకు పోలీసులు తనదైన రీతిలో స్పందించి దౌర్జన్యం చేసిన సంఘటనలను చిత్రీకరించాడు. ఏమాత్రం రాజకీయ స్వేచ్ఛలేని హైదరాబాద్ నగరం కేంద్రంగా రాజకీయ నేపథ్యంలో అదీ ఒక మహిళ నడిపిన ఉద్యమాన్ని నేపథ్యంగా కథను నిర్మించడం ఆయన చైతన్యానికి ప్రతీక. 'కామాక్షి' అనే కథను వితంతువివాహానికి మద్దతుగా రాసిండు. 'భారతి'లో ప్రచురితమైన 'కుసుమం' కథలో స్త్రీ పురుషుల సంబంధాలను, మానవీయ కోణంలో ఆవిష్కరించిండు. ఇందులో ఒక పాత్ర చేత "లేదు, నీకు తేలీదు. పురుషుడు లేక యే స్త్రీ కూడా చెడదు. తప్పించుకో తిరిగే స్త్రీని మొగ మహరాజే వెంటపడి సామదానబేధ దండోపాయాల్తో లొంగతీస్తాడు. మళ్లీ వేళ్ళే దుర్మార్గురాలు, నీతి హీనురాలు, అని నరకానికి తొక్కుతారు. మొగవాడే సంఘం కనుక." అనిపిస్తాడు. నందగిరి తన తరానికికన్నా ముందున్నవాడు అని చెప్పడానికి అనేక అకరాల్లో ఇవి మచ్చు మాత్రమే. 'బోగంది' కథలో పురుషుల చేతల వల్ల స్త్రీలు అన్యాయానికి గురవుతున్నవైనాన్ని, 'ప్రతిఫలం' కథలో మొగలు సైన్యాలు గోలకొండ కోటను స్వాధీనం చేసుకునే సందర్భంగా జరిగిన సంఘటనల్ని అక్షరబద్ధం చేసిండు. ఈయన రాసిన 'సితార' కథ చలం 'ఓపువ్వు పూసింది' కన్నా మిన్నగా ఉందని విమర్శకులు అభిప్రాయపడ్డారు.

తెలంగాణ సాయుధపోరాటారంభానికి 15 యేండ్ల ముందే దొరల దౌర్జన్యాన్ని నిరసిస్తూ 'పటేలుగారి ప్రతాపం' పేరిట కథ రాసిండు. గ్రామ పటేలు తన మాట వినని రామయ్య అనే రైతును కొట్టడమే గాకుండా వితంతువైన ఆయన సోదరిని అల్లరి చేయడం. దీనికి పటేలు తల్లి కూడా మద్దతుగా ఉండి నీ తండ్రి కాలంలో ఎదురు తిరిగి మాట్లాడిన వాడు లేడు అని కొడుకుని రెచ్చగొట్టడం, అడ్డు వచ్చిన వారిని బెదిరించడం జరిగింది. దాదాపు ఇలాంటి ఘటనే సాయుధ పోరాట కాలంలో జరిగింది. ఈ కాలంలో విసునూరి దొరలు ఇలాగే దౌష్ట్యానికి దిగారు. విసునూరి 'బాబుదొర'ను ప్రజలు చంపేసినట్లుగానే ఈ కథలో కూడా ప్రజలు దొరను చంపేస్తారు. అయితే వాస్తవానికి జరిగిన సంఘటనకన్నా 15 యేండ్లకు ముందే నందగిరి వెంకటరావు పటేలుగారి ప్రతాపంలో ఇవే సంఘటలను చిత్రీకరిస్తూ ప్రజలు తిరుగుబాటు చేయాలని పరోక్షంగా చెప్పిండు. 'చిత్రచోరులు' కథలో ఒక అంశాన్ని భిన్న కోణాల్లో చూసే తెలంగాణ ఆంధ్ర వారిని గురించి రాసిండు. ముస్లింతో లేచిపోయి హుసేన్‌బీగా మారిన వితంతువు రామక్క కథను మరో కథలో చిత్రీకరించిండు.

కథలే గాకుండా అనేక నాటకాలు, విమర్శక వ్యాసాలు, 1935లో హైదరాబాద్‌లో మొట్టమొదటి సారిగా అఖిలాంధ్ర కథకుల సమ్మేళనాన్ని నిర్వహించి తెలుగు కథ పరిపుష్టం కావడానికి తీసుకోవాల్సిన చర్యల్ని, అందుకు కథకులు నిర్వహించాల్సిన కర్తవ్యాల్ని ఆయన విస్తృత ప్రచారంలో పెట్టిండు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే కథలు రాయడం ఆపేసిన నందగిరి వెంకటరావు తెలుగువారి ముఖ్యంగా తెలంగాణవారి జీవితంలోని అనేక విస్మృత, నిగూఢమైన పార్శ్వాలను అక్షరీకరించి సాహిత్యంలో వాటికి శాశ్వతత్వాన్ని తీసుకొచ్చిండు. కథానిక రచనను ఒక ఉద్యమంగా ప్రచారం చేసిండు. ఆంధ్రమహాసభ తరపున కథానిక పోటీలు నిర్వహించడంలో తోడ్పడిండు. కథలు రాయడం ఎందుకు ఆపేశావని ఎవ్వరడిగినా తన బదులు ఇందిరాదేవి రాస్తుంది కదా అది చాలు అని తన భార్య నందగిరి ఇందిరాదేవిని దృష్టిలో పెట్టుకొని చెప్పేవాడు. నందగిరి ఇందిరాదేవి తొలితరం తెలంగాణ కథారచయిత్రుల్లో అగ్రగణ్యురాలు. ఆవిడ కథలు ఆనాటి అన్ని పత్రికల్లో చోటు చేసుకున్నాయి.

కేవలం కథకుడిగా విమర్శకుడిగానే కాకుండా నందగిరి వెంకటరావు తెలంగాణ ప్రజల రాజకీయ సామాజికోద్యమాల్లో కూడా ముందుండి మార్గదర్శకుడయ్యిండు. నిజామాబాద్‌లో జరిగిన ఆంధ్రమహాసభల్లో తెలుగుకు ప్రాధాన్యత లభించడంలేదనే కారణంతో సురవరం ప్రతాపరెడ్డితో కలిసి అభివృద్ధిపక్షంగా ఏర్పడి ఆంధ్రమహాసభల్లో తెలుగుకు సరైన ప్రాతినిధ్యం దక్కాలని ఉద్యమం చేసిండు. అలాగే సురవరంతో కలిసి తెలంగాణ గ్రంథాలయోద్యమానికి జీవం పోసిండు. మహబూబ్‌నగర్‌లో 50వ దశకం ఆరంభంలో తాను జడ్జిగా పనిచేస్తున్న కాలంలో బాలసరస్వతి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిండు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆంధ్రమహాసభ చేపట్టిన ప్రతిపనిలో నందగిరి భాగస్వామ్యముండేదంటే అతిశయోక్తి కాదు. స్త్రీ విద్య కోసం ప్రస్తుతం హైదరాబాద్‌లోని మాడపాటి హనుమంతరావు పాఠశాల నిర్మాణంలో కూడా పాలుపంచుకున్నాడు. అలాగే తన భార్య నందగిరి ఇందిరాదేవితో కలిసి ఆ పాఠశాల అభివృద్ధికి, సంఘసేవకు ఎంతగానో కృషి చేసిండు. జాతీయోద్యమంలో పాల్గొన్నందుకు గాను జైలుశిక్ష కూడా అనుభవించాడు.

మేడ్చల్‌కు దగ్గరలోని పూడూరులో జూలై 22, 1909లో జన్మించిన వెంకటరావు తల్లిదండ్రులు పద్మావతి, కిషన్‌రావులు. అయితే సికింద్రాబాద్‌లో స్థిరపడ్డ ఈయన తెలుగుతో పాటు ఉర్దూలో 'ముషీరె దక్కన' పత్రికలో, ఇంగ్లీషులో 'హైదరాబాద్ బులిటెన్'లలో క్రమం తప్పకుండా కథలు, వ్యాసాల్ని వెలువరించేవాడు. తెలుగు సాహిత్యానికి ఇంత విశేషమైన సేవ చేసిన నందగిరి వెంకటరావు కథలు 50కి పైగా ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఈ కథలు గత శతాబ్దపు తొలి దశాబ్దాల్లో తెలంగాణ ప్రజల జీవన స్థితిగతులు, ఆలోచనా సరళి, మానవ సంబంధాల్ని తెలుసుకోవడానికి వీలవుతుంది. వెంకటరావు అమెరికాలో 5లో చనిపోయారు.



**డా. సంగిశెట్టి శ్రీనివాస్**
**9849220321**

# పామ్ పామ్

కథ



నగరజీవితంలో వుంటూ కూడా రోజూ యోగా క్లాసులకు క్రమం తప్పకుండా వెళుతున్న మా దోస్తుగాణ్ణి చూస్తే వూర్కుండి వచ్చిన నాకు ముచ్చటేసింది. వాడూ రమ్మన్నాడని వెంట నడిచాను.

పార్క్‌లో యోగా షెడ్‌లో పొద్దుటే అంతమంది వయసుమీదపడ్డ వాళ్ళని చూస్తూ 'గ్రేట్' అనకుండా వుండలేకపోయాను.

యోగా మొదలైంది. ప్రార్థన చేశారు. మావాడు ముందే చెప్పాడు. యోగా అందరిది. మతాన్ని కలిపి హిందువులదిగా చేసేశారన్నాడు. 'ఒక మతానికి యెందుకు పరిమితం చెయ్యాలి?, వాళ్ళకెందుకు పేటెంట్ హక్కు యిచ్చి వదిలెయ్యాలి' నాతో ప్రశ్నలు వేసి వున్నందువల్ల కొత్తగా మళ్ళీ నేను మరో ప్రశ్న వెయ్యలేదు.

వామప్ యిరవై నిముషాల్లో అయిపోయింది. సూర్యనమస్కారాలు మొదలయ్యాయి. 'ఓం మిత్రాయ నమః'తో. బ్రీత్ యిన్ బ్రీత్ అవుట్ మీద దృష్టికన్నా అందరి దృష్టీ ఆ సూర్య నమస్కారంలోని పన్నెండు భంగిమలు మారినప్పుడల్లా వుచ్చరిస్తున్న దేవుడి నామాల మీదే వుంది. 'ఆరోజు యే దేవుడి రోజయితే...' రిలాక్స్ సమయంలో దోస్తుగాడు చెప్పబోయాడు. ఈలోగా 'జై శ్రీరామ్' వచ్చి చేరింది. మరిది? అన్నట్టు చూశాను. 'మూడువందల అరవైయ్యైదు రోజులూ' అన్నాడు. పంచాక్షరీ స్టాండింగ్ ఆసనాలు సిటింగ్ ఆసనాలూ అయిపోయాయి. ప్రాణాయామాలు కూడా మొదలైయ్యాయి. నేనూ మెడిటేషన్ మోడ్‌లో వున్నాను.

"పామ్ పామ్ పామ్... పామ్ పామ్ పామ్..." అందరూ చప్పట్లు చరుస్తూ అరుస్తుంటే, కళ్ళు విప్పి దిగ్గున లేచాను. పారిపోదామని వేసిన రెండడుగులతో ఆగిపోయాను. ఎందుకంటే, అందరూ ప్రశాంతంగా కూర్చొని వున్నారు. అప్పుడు అర్థమయ్యింది. అందరూ భజన చేస్తున్నారని.

నేను వణుకు తగ్గి కూర్చొని మావాడి పక్కకు జరిగాను.

"భజన యోగ" అన్నాడు దోస్తు, నన్నో పల్లెటూరి బైతుని చూస్తున్నట్టు చూస్తూ.

"మరి పామ్ పామ్ అని అరుస్తారేంటి?" అన్నాను, గుసగుసగా గింజుకుంటూ.

"అది పాం కాదు, వోం" మావాడు కూడా నాకు చెప్పి మళ్ళీ "పామ్ పామ్..." భజన యోగాలో కలిశాడు, గొంతు కలిపి.

మావాడి కళ్ళలో కళ్ళు పెట్టి చూస్తూ "పాం?" అన్నాను.

"పామ్ పామ్... పామ్ పామ్..." మావాడు కూడా అంటున్నాడు. అప్పుడు అర్థం చేసుకున్నట్టు చూస్తూ "ఓం?" కళ్ళతోనే అడిగాను.

భజన ఆపకుండా తల పైకీ కిందికీ ఆడిస్తూ అవునన్నట్టు చూశాడు, చిన్నగా నవ్వుతూ. నేను నవ్వలేదు.

"ఓంకి పామేంటి... మాయరోగం?" అన్నాను, గుండెదడ అప్పటికింకా తగ్గలేదు.

"ఓమ్ ఓమ్... పోమ్ పోమ్... పామ్ పామ్..." నాకోసమన్నట్టు అర్థంచేసుకోమన్నట్టు గట్టిగా అన్నాడు.

యోగా అయ్యాక బయటికి వచ్చాక అప్పుడు చెప్పాడు మావాడు. "మా యోగా గురువు గురువుకి తెలుగు సరిగా రాదు, మార్వాడీ..." చెపుతుంటే, "ఓం తెలుగు పదం కాదు, సంస్కృత పదం" మధ్యలో అన్నా, నన్ను పట్టించుకోకుండా మా దోస్తుగాడు "అంటే... ఆయన ఓమ్ ఓమ్‌ని పోమ్ పోమ్... పామ్ పామ్... అదన్న మాట" అర్థవివరణగా నవ్వాడు దోస్తుగాడు.

"మరి మీ గురువు తెలుగువాడే కదా?" అన్నాను, అనుమానం తీరక.

"పక్కా తెలుగువాడు. అతనికి నీలాగ తెలుగు తప్ప మరో భాష రాదు" అన్నాడు దోస్తు.

"మరి ఆయన 'ఓం' అనొచ్చుగా?" అన్నాను.

"గురు ప్రభావం!" మావాడు మళ్ళీ నవ్వాడు.

"నీ మీద కూడానా?" అన్నా, "చూశావుగా అందరూ పామే అంటున్నారు, పామే అనాలేమో అని నాకూ 'పామ్ పామ్...' అనే అలవాటయ్యింది..." అన్నాడు దోస్తు, నవ్వేస్తూ.

నేనూ యేడవలేక నవ్వాను.

'అందులో నవ్వడానికేముంది?' అన్నట్టు చూశారు, మమ్మల్ని వెన్నంటి వస్తున్న యోగా సాధకులు.

**బమ్మిడి జగదీశ్వరరావు**
**9490696911**

## అరాచకీయ కాలకేయులు

ఆక్టోపస్ లా విస్తరిస్తున్నారు
కరెన్సీ కట్టలతో కడుపు నింపుతారు
మద్య మాంసాల మత్తులో ముంచుతారు

మద్యం తాగించింది ఎవరో
కరెన్సీ నోట్లు జేబులో పెట్టింది ఎవరో
వారికే తెలియని నిద్రాణస్థితిలో
మద్యం పోసిన వారికి కాకుండా
నోట్లరెపరెపలు వినిపించుకోకుండా
ఏంజరుగుతుందో ఏమో తెలియని స్థితిలో

ఆ సమయానికే ఎవరు గుర్తొస్తే
వారికి జేజేలు కొడుతూ
వీధుల్లో వీరంగం వీరవిహారం
నోట్లిచ్చినవాడినోట్లోమట్టి
మద్యం మాంత్రికులు కళ్లలో కారం
నానోటునాకివ్వు
నామందు నాకు కక్కుఅంటూ
కాలకేయులకరాళ నృత్యం
ఇదే ఇప్పుడు జరుగుతున్నవ చరిత్ర

రేపు ఏం జరిగినా ఎవడికీ పట్టదు
ఇప్పటికిప్పుడు దాహం తీరాలి
ఇప్పటికిప్పుడు కడుపు నిండాలి

**తాటి కొండాలనరసింహారావు**
**చరవాణి. 9885787250**

## పాత సైకిల్



రోడ్డు ఎక్కక ఎన్ని సంవత్సరాలో..
సీటు కుషన్ ను పిల్లలు
గుచ్చి గుచ్చి రంధ్రాలు పెడుతున్నారు
లైట్ వెలగకున్నా
గతాన్ని మింగి కడుపులో
దాచుకున్నట్టు
ఏదో చెప్పాలని ఆగిపోయిన
మనిషి లా చూస్తుంది
రిమ్ములకు చిలుము పట్టి
జ్ఞాపకాలను నెమరు వేస్తున్నదానిలా ఉంది
అక్కడక్కడా విరిగి వంకలు తిరిగిన
చెట్టు కొమ్మల్లా పుల్లలు
కొన్ని అల్లిబిల్లిగా అలుముకున్నాయి
చైన్ ఆయిల్ రాసుకొని
ఎన్నాళ్లో
పైడిల్ కదిపినా తిరగక
సతాయించే పిల్లాడిలా
మొండికేస్తుంది
కీళ్ళచప్పుడులా
అరిగిపోయిన చక్రాలు
ఎన్ని మైలురాళ్ళనో
దాటుకుని వచ్చింది
ఇలా ఒక మూలాన
దిగాలుగా పడివుంది
గుర్రం ఎక్కలేని
ఎందరికో ఈ సైకిలే కలల
పంచకళ్యాణి
ఎందరినో రాకుమారులను
చేసింది
గిర్రున తిప్పి
లోకాలను చుట్టేసే కీలుగుర్రం
కాకేంటి
సప్తసముద్రాల మాటేమిటో కానీ
మనోహరి మనసు గెలిపించేది
ఇదే కదా!
కాసింత గాలిని
ఊపిరి తిత్తులు తీసుకుని
రయ్ రయ్ మంటూ రోడ్డును
నడిపించేది
ఇప్పుడు
మడ్గార్ మెడ వంగి ముందుకు
కదలనీయడం లేదు
ఘంట చప్పుడు లేకుండా
మూగబోయింది

**డా. సుంకర రమేశ్**
**9492180764**

## సంధి సందిగ్ధం

అణు ఒప్పందం
పశ్చిమాసియా యుద్ధం
ఆర్థిక ధ్వంసం

వ్యాపార పోటీ
గతిశక్తి ఇంధనం
ఆయుధ బలం

సముద్ర మార్గం
గూడ్స్ రవాణ ఓడలు
టోల్ గేట్ వసూలు

పన్నుపై పోరు
రెండు దేశాల జోరు
జనం బేజారు

రణ వ్యాపారం
ఆయుధాల ప్రయోగం
సంధి సందిగ్ధం

ఆగని యుద్ధం
సాగని ప్రగతి రథం
ప్రపంచం డీలా

**రేడియమ్**
**9291527757**

## మౌనంగానే

మాట్లాడటం మహా పాపమైనట్టు
మాట్లాడటం మహా నేరమైనట్టు
నోరు మూసుకునే వుందాం

క్షుద్రపూజల మధ్య
భద్రజీవులం కదా

జాదూగారి జిమ్మిక్కు కథల్ని
జంతర్ మంతర్లో పాడే వాళ్ళతో
మనకేం పన్లే?

బుల్డోజర్ల ముక్తి గీతం
భూత వైద్యం భక్తి పాఠం
పూజలు పునస్కారాలు
ఆహా..
పుణ్యకాలం స్వాహా!

ఉండనే ఉంది కదా
బత్తునికి భోగవంతుని అనుసంధానమైనది
అమ్మికా దొరవారి వొత్తి
మనమిక నమ్మికగా అమ్మకమై పోవచ్చు

బతుకులకు కట్టిన బురిడీల తాయత్తు
గుట్టు రట్టు చేస్తున్న వాళ్ళతో
మనకేం పన్లే?

భక్తి చేతి
భక్తి కొరకు
భక్తి వలన
ముక్తి స్వామ్యం ఓహో..

వర్ధిల్లు వర్ధిల్లు
వందే భగవంత్

కాలం
పట్టాలు తప్పిన పవిత్ర గడియల్లో
జనం పాట్లతో మనకేం పని
భజన పాటలుండగా
భద్రంగా పాడుకుందాం
భయ భక్తులతోనే మసులుకుందాం

దొరలు దోచగల
దొంగలెత్తుక పోగల
విష వర్ధనంబు విద్యా ధనంబు
కాపాడడానికి కంకణం కట్టుకుని
ప్రశ్నల డప్పులై మోగుతున్న వాళ్ళతో
మనకేం పనీ?

అచ్చరాల మాయా కంతశాల
లోకమంతా పచ్చగానే ఉందట
పచ్చకామిర్ల మీడియా
పంజరంలో రామ చిలుక

వండి వారుస్తున్న
కుల కార్తీక వనభోజనాలు
మౌనంగానే ఆరగిద్దాం

వనాల మౌనం
జనాల మౌనం
వీధుల మౌనం
విలువల హంతక భోజ్యం
మౌనమే వధలకు పట్టుగొమ్మ
నిజం నిప్పులా రగులుతున్నప్పుడు
మౌనం హంతకుల ఆయుధం

మాట్లాడటమే మహా పాపమంటున్న చోట
మాట్లాడటమే మహా నేరమంటున్న పూట

మనుషులమై పుట్టి
మౌనంగా ఎట్టా వుంటామని
మాటల జెండాలై
పాటల దండులై
లాఠీలకు ఎదురు నిలిచి
నెత్తుటి బొట్లయ్యే వాళ్ళతో
మనకేం పనీ?

నయ వంచనల ముసుగు
నంగితనాల తొడుగు
కుప్పిగంతుల కుతంత్రాలు
కుట్రల కుదురుల్లో కులికే మోసాలు
జపిస్తూ
తపిస్తూ
మౌనంగా పఠిస్తూ నటిస్తూనే వుందాం

నోళ్ళు కుట్టేసుకుని మరీ..
నేరాలకు ఘోరాలకు 'నీట్ గా'
నీతి పూతలు పూద్దాం

సత్యాన్ని పాడే వాళ్ళతో మనకేం పన్లే
చరిత్రను తిరగరాసే వాళ్ళతో మనకేం పన్లే
చీమూ నెత్తురున్న వాళ్ళతో మనకేం పన్లే
చేతులెత్తి నినదించే వాళ్ళతో
మనకేం పని..లే?

**పల్లిపట్టు నాగరాజు.**
**9989400881**

## పుస్తక సమీక్షల కోసం...
తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad.
Telangana- 500034.

## రచనలకు ఆహ్వానం
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి.. మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## ఆగస్టు 31న చలో సెక్రటేరియట్

- నీలం నరేందర్
- మాల మహానాడు జిల్లా నాయకులు



**భువనగిరి మహా న్యూస్ :** ఈనెల 31న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా నాయకులు నీలం నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు మాలల హక్కుల కోసం ఎంతటి త్యాగాలకైనా మాలల సిద్ధం కావాలని ఆయన అన్నారు హక్కులు బిక్షం అడిగితే రావని పోరాటాల ద్వారా సాధించుకోవాలని ఆయన అన్నారు రోస్టర్ ద్వారా మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని తిప్పి కొట్టాలని ఆయన అన్నారు జిల్లాలోని అన్ని మండలాల నుండి మాల సోదరులు ఐక్యంగా కదలి రావాలని ఆయన పిలుపునిచ్చారు

## ఆటో డ్రైవర్ల బందుకు ఎం సి పి ఐ యు పార్టీ సంపూర్ణ మద్దతు

**బెల్లంపల్లి,మహా:** ఆటోడ్రైవర్లకు రాష్ట్రప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చాలని ఆటో డ్రైవర్లు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బందుకు ఎం సి పి ఐ యు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందనిఎంసిపిఐయు పార్టీ ,అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం నాడు బెల్లంపల్లి ఎంసీపీఐయు పార్టీ కార్యాలయంలో అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ ఆదివారం రోజు అర్ధరాత్రి నుండి ఆటో డ్రైవర్ల బందుకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని ఆటో డ్రైవర్లకు ఎలక్షన్ ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఎనిమిది లక్షల మంది ఆటో డ్రైవర్లు ఆటో వృత్తినే ప్రధాన జీవనాధారంగా చేసుకొని వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిందని మహాలక్ష్మి పేరిట బస్సులలో మహిళల కు ఉచితం అని పెట్టి ఆటో డ్రైవర్ల నడ్డి విరిచారని , తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్ల అందరికీ అన్యాయం చేశారని, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లు చేస్తున్న సమ్మె న్యాయమైన సమ్మె అని తెలియజేస్తూ ఆటో డ్రైవర్లు చేస్తున్న సమ్మెకు ఎం సిపిఐ యు పార్టీ, ఏ ఐ సి టి యు తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ యాజమాన్యానికి ఈ వి ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం విరమించుకోవాలని,ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేల రూపాయలను ప్రకటించిన విధంగా అందజేయాలని,ఫ్రీ బస్సు వలన ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్లకు 25 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ,ఆటో కార్మికులకు వారి కుటుంబాలకు 1000 కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,ఓలా ఉబర్ రాపిడో వంటి యాపులు వచ్చి ఆటో కార్మికుల పొట్ట కొడుతున్నందున వాటిని వెంటనే నిషేధించాలని,ఆటో డ్రైవర్లకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మఇండ్లను మంజూరుచేయాలని,ఆటో డ్రైవర్లకు ఆటో స్టాండ్లు ఆటో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలనే తదితర న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి ఆరెపల్లి సతీష్, తొగరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# కొండా దంపతులను బర్తరఫ్ చేయాలి

- పదవుల కోసం బీసీ నినాదాన్ని అడ్డుపెట్టుకోవడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ సీనియర్ నేత నల్గొండ రమేష్
- అక్రమ కేసులు పెట్టిస్తున్న కొండా దంపతుల తీరు పార్టీకి తీవ్ర నష్టం
- సీఎం రేవంత్ కు సుస్మిత పటేల్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార



**వరంగల్, బ్యూరో మహా** : వరంగల్ తూర్పు కాంగ్రెస్లో ముసలం మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున తూర్పు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కొండా సురేఖ ను గెలిపించడానికి చాలామంది వరంగల్ తూర్పు కాంగ్రెస్ సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు కష్టపడి సమన్వయంతో పనిచేసి వారిని గెలిపించారని అప్పుడు గెలిపించిన వారే కొండా దంపతుల నుండి వారికి కనీస గౌరవం దక్కక, మరికొందరు పార్టీ కోసం కష్టపడ్డ వారిని పక్కనపెట్టి ఇతర పార్టీ నుండి వచ్చిన వారి చేతిలో నియోజకవర్గాన్ని అప్పగించారని వారంతా ఓ వర్గంగా విడిపోయి కొండా దంపతుల పై అసమ్మతి వర్గంగా తయారయ్యి ఇప్పుడు కొండా దంపతులనే పార్టీ నుండి బర్తరఫ్ చేయాలనే పరిస్థితి వరంగల్ తూర్పు కాంగ్రెస్లో నెలకొంది. కొండా దంపతులు వారి పదవుల కోసం బీసీలను అడ్డం పెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుతూ.. అదే సామాజిక వర్గాన్ని ఎదగనివ్వడం లేదని ఆ వర్గానికి చెందిన నాయకులు ఎవరూ ఎదగకుండా అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత నల్గొండ రమేష్ బహిరంగంగా విమర్శించారు. కొండా దంపతుల అధికార దాహం వారి ఒంటెద్దు పోకడలతో ఇటు పార్టీకి, కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు తీవ్ర నష్టం జరుగుతోందని, గత కొంతకాలంగా వారు నియోజకవర్గంలో స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి కూడా లేకుండా పోయిందని అన్నారు. ఇటీవల మంత్రి జన్మదిన వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కుమార్తె సుస్మిత పటేల్ బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం రాంకీ లోని మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు మంత్రి కొండా సురేఖ, కొండా మురళి, సుస్మిత పటేల్ పై తీవ్ర విమర్శలు చేశారు. కొండా దంపతులు బీసీలను అడ్డం పెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుతున్నారని రమేష్ ఆరోపించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రెండో బీసీ నాయకుడు ఎదగకుండా చేస్తున్నారని విమర్శించారు. వారి గెలుపు కోసం పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులను పక్కనపెట్టి నియోజకవర్గాన్ని ఒకరి చేతుల్లో పెట్టారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పై సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు పార్టీకి తీవ్ర నష్టం కలిగించేలా ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా కొండా సురేఖ గెలుపు లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కష్టం తో పాటు ఎన్నికల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఓట్లు వేయలేదని అన్ని కుల మతాలు వివిధ వర్గాల వారు ఒక్కటై ఓట్లు వేస్తేనే ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేశారు.

**బీసీలను అణగదొక్కుతున్నారని ఆరోపణలు**

ఈ సమావేశంలో వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేశ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సుస్మిత పటేల్ కు ఏం అర్హత ఉందని ప్రశ్నించారు. వరంగల్ తూర్పులో బీసీలను అణగ తొక్కడమే కొండా దంపతులు పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఓ బీసీ మహిళ అయి ఉండి బీసీలనే అణగదొక్కుతున్నారని విమర్శించారు. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తల పై అక్రమంగా కేసులు పెట్టించి రౌడీషీట్లు ఓపెన్ చేయిస్తున్నారని ఆరోపించారు. పార్టీ కోసం పనిచేసే వారిని ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

**ఏ హోదా ఉందని కొండా మురళికి టికెట్లు ప్రకటిస్తారు?**

మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ బీసీ నినాదంతో పదవులు చేపట్టి బీసీలనే అనగదొక్కుతూ గెలిపించిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల పై అక్రమ కేసులు పెట్టించిన కొండా మురళికి ఏ హోదా ఉందని పరకాల టికెట్, కార్పొరేటర్ల టికెట్లు ప్రకటిస్తారు? మీరెవరు ప్రకటించడానికి?" అని మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ ప్రశ్నించారు. క్రమశిక్షణ లేని వారు పార్టీలో ఉండకూడదని మంత్రి పదవి నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి పదవి నుంచి ఎప్పుడు బర్తరఫ్ అవుతుందా అని ఆ వేడుకల కోసం తూర్పు నియోజకవర్గ ప్రజలు, నిజమైన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఎదురు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. కొండా దంపతుల వ్యవహార శైలి శాడిజాన్ని తలపించేలా ఉందని, వారి నిరంకుశ వైఖరిని ప్రశ్నిస్తున్న తూర్పు కాంగ్రెస్ సీనియర్ నాయకులను కార్యకర్తలను కొట్టిస్తున్న వీడియోలను చూసి ఆనందిస్తారని ఆరోపిస్తూ తీవ్రంగా తప్పుబట్టారు. అంతేకాకుండా నియోజకవర్గంలో కొండా దంపతుల ఆదేశాలతో అక్రమ కేసుల్లో బలైన నాయకులు కార్యకర్తల పేర్లను నరేందర్ వెల్లడించారు. ప్రస్తుతం వారితో ఉన్నవారు ప్రేమతో కాకుండా కేవలం భయంతో జై కొట్టడానికి ఉన్నారని అన్నారు. మీరు అనుకున్నట్టుగా మీది ఊపు కాదు.. వాపు అని ఎద్దేవా చేశారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఉన్న నాయకులను కార్యకర్తలను కొండా దంపతులు పూర్తిగా విస్మరించారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు బస్వరాజు పెద్ద కుమార్, తోట హరీష్, డిష్ శ్రీనివాస్, గోరంట్ల రాజు, బాలరాజు, సందీప్ వినోద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## భాగ్యనగర్ తండాలో ఘనంగా తీజ్ వేడుక

**కారేపల్లి, మహ :** మండలంలోని భాగ్యనగర్ తండాలో ఆదివారం తీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. తీజ్ పండగలో భాగంగా గ్రామంలో తొమ్మిది రోజులుగా యువతులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం నిమ్మజన కార్యక్రమంను బంజారా సంప్రదాయం నృత్యలతో సందడిగా చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ పాల్గొని మాట్లాడుతూ బంజారా(లంబాడా ) సమాజం అనాదిగా ప్రకృతిని ప్రేమిస్తూ ప్రకృతితో మమేకమై, జీవిస్తున్న సమాజమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్, బానోత్ రాందాస్ నాయక్, లకావత్ దామ్లా, భగవాన్ దాస్, హాతీయ, బాబా, తోప్య, బానోత్ రాంచందర్, బానోత్ మంగీలాల్, లావుడ్యా ఈర్య, భూక్యా తారాచంద్, వీరన్న, గాంధీ, రాంబాబు, గోబ్రియ,బాబు, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో "గూడెం"కు పాస్‌పోర్ట్ సేవా కేంద్రం

- ప్రజలకు తీరనున్న కష్టాలు
- హెడ్ పోస్టాఫీసులో ఏర్పాటుకు చర్యలు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని హెడ్ పోస్టాఫీసులో త్వరలోనే పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (పిఓపిఎస్కే) ఏర్పాటు కానుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెంలో పాస్‌పోర్ట్ కేంద్రం ఏర్పాటు చేయాలని తాను కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి సమర్పించిన లేఖలు సంప్రదింపులపై అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి అనుమతితో కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పీఎస్పీ డివిజన్ అండర్ సెక్రటరీకి పరిశీలన నిమిత్తం ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. కొత్తగూడెం ప్రధాన పారిశ్రామిక గనుల వాణిజ్య కేంద్రంగా విస్తరించి ఉందని ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఉద్యోగులు నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం పాస్‌పోర్ట్ సేవల కోసం 75 కిలోమీటర్ల దూరంలోని ఖమ్మం, మహబూబాబాద్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని గుర్తు చేశారు. దీనివల్ల వృద్ధులు మహిళలు విద్యార్థులు ప్రజలు సమయం డబ్బు వృథా చేసుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం కొత్తగూడెం ప్రత్యేక జిల్లా కేంద్రంగా మారినందున ఇక్కడే పూర్తిస్థాయి కేంద్రం అవసరమని స్పష్టం చేశారు. ఈ సమస్యను కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు సాధించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామని తెలిపారు. త్వరలోనే కేంద్రం నుంచి అధికారిక ఆదేశాలు వెలువడి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం అందుబాటులోకి రానుందని కూనంనేని తెలిపారు.



## ప్రకృతిని ఆరాధించే విశిష్ట పండుగ బోనాలు

- భక్తిభావం ఐక్యతను పెంపొందించే వేడుక
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం,మహా:** బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అని ప్రజలంతా సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. లక్ష్మీదేవిపల్లి పరిధిలోని సింగరేణి బంగ్లోస్ గేటు సమీపంలో వెలసిన శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం శ్రావణమాస బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు శ్రావణ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడే గొప్ప సంప్రదాయం మన పండుగల్లో దాగి ఉందని పేర్కొన్నారు. గ్రామాలు పట్టణాలు సుభిక్షంగా ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని కోరుతూ భక్తిశ్రద్ధలతో ప్రజలు అమ్మవార్లను కొలవడం మన ఆచారమన్నారు. ఇలాంటి ఉత్సవాలు సమాజంలో సోదరభావం ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన వివరించారు. పోచమ్మ తల్లి చల్లని దీవెనలతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు శాంతిసౌభాగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, ఆలయ ధర్మకర్త తదితరులు పాల్గొన్నారు.

## వెంకట సాయి నగర్‌లో ముత్యాలమ్మ బోనాలు

**కారేపల్లి, మహ :** కారేపల్లి వెంకట సాయి నగర్‌లోశ్రావణమాసం సందర్భంగా ఆదివారం ఘనంగా ముత్యాలమ్మ బోనాలు నిర్వహించారు. కాలనీవాసులు మేళ్ల తాళాలతో ఊరేగింపుగా బోనాలతో గ్రామదేవతలు బొడ్రాయి, ముత్యాలమ్మ అభిషేకం నిర్వహించి బోనాల సమర్పించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రాంబాబు, బొల్లు హనుమంతరావు, రవి, భాగం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## పేదింటి గృహప్రవేశానికి 'వెలిచాల' కానుక

- ఇందిరమ్మ ఇల్లు పూర్తయితే.. ఆడబిడ్డ ఇంటికి కొత్త వెలుగు
- గృహప్రవేశం చేసుకునే కుటుంబాలకు ఇండక్షన్ స్టవ్ లేదా బోళ్ళ సెట్ అందిస్తా..
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ప్రకటన..
- చామనపల్లి గ్రామం నుంచి
- ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం



**కరీంనగర్, మహా** : ఇందిరమ్మ ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదు.. పేద కుటుంబానికి అది భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్‌కు భరోసా. అలాంటి సొంతింటి కల నెరవేరిన వేళ ఆ కుటుంబంతో కలిసి సంతోషాన్ని పంచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మరో అడుగు ముందుకేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసుకునే ఆడబిడ్డలకు తనవంతు సహాయంగా ఇండక్షన్ (ఎలక్ట్రిక్) స్టవ్ లేదా బోళ్ళ సెట్ అందజేస్తానని ప్రకటించారు. ఈ వినూత్న కార్యక్రమానికి చామనపల్లి నుంచి శ్రీకారం చుట్టారు.

కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో పల్లె జగదీష్-శిరీష దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆదివారం వెలిచాల రాజేందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెడుతున్న దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబం సొంతింటి గడప తొక్కుతున్న సందర్భం ప్రతి ఒక్కరికీ ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. మొట్టమొదటిసారిగా ఈ దంపతులకు ఇండక్షన్ స్టవ్ తో పాటు బోళ్ల సెట్‌ను అందజేస్తానని పేర్కొన్నారు.

**సొంతింటి కలకు ప్రభుత్వ భరోసా**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని రాజేందర్‌రావు తెలిపారు. మొదటి విడతలో నాలుగు లక్షల ఇళ్లకు మంజూరు చేయగా, ఇప్పటికే పెద్ద సంఖ్యలో నిర్మాణాలు పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. రెండో విడతలో మరో రెండు లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.

రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయంతో పేదలకు సొంతింటి కలను నిజం చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఇల్లు లేని అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రేకుల షెడ్లు వేసుకుని లేదా గోడల వరకు నిర్మాణం పూర్తిచేసుకుని ఇబ్బందులు పడుతున్న అర్హులైన కుటుంబాలకు కూడా పథకం కింద రూ.2 లక్షల వరకు ప్రభుత్వ సహాయం అందించే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి వారు తమ గ్రామ సర్పంచ్‌ను సంప్రదించి వివరాలు అందించాలని సూచించారు.

**గృహప్రవేశం వేళ.. ఓ చిన్న కానుక.**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయి గృహప్రవేశం చేసుకునే ప్రతి ఆడబిడ్డ ఇంట్లో ఆనందం మరింత రెట్టింపు కావాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు రాజేందర్‌రావు తెలిపారు. ప్రభుత్వం సొంతింటి కలను నెరవేర్చే బాధ్యత తీసుకుంటే.. ఆ ఇంట్లో తొలి అడుగు వేసే కుటుంబంతో తనవంతుగా ఆనందాన్ని పంచుకోవాలన్నదే తన ఉద్దేశమని పేర్కొన్నారు. చామనపల్లి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం కరీంనగర్ నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.

**పద్మశాలీ సంఘ భవనానికి సహకారం**

చామనపల్లిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రాజేందర్‌రావును ఘనంగా సన్మానించారు. సంఘ భవన నిర్మాణానికి తనవంతు సహాయం అందించడంతో పాటు, ప్రభుత్వ పరంగా అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలోనూ రాజేందర్‌రావు పాల్గొన్నారు. గౌడ కులస్తుల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

**నెలలోపు ఇల్లు పూర్తి చేసే బాధ్యత**

ఇరుకుల్ల గ్రామంలో విజయలక్ష్మి-రామ్‌రెడ్డి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రాజేందర్‌రావు భూమిపూజ చేశారు. ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేసి నెలలోపు పనులు పూర్తయ్యేలా చూస్తానని, నిర్మాణానికి సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు అందేలా అధికారులతో సమన్వయం చేస్తానని తెలిపారు. అనంతరం ఇరుకుల్లలో కురుమ సంఘం సభ్యులతో కలిసి బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, చామనపల్లి సర్పంచ్ బోగొండ ఐలయ్య, భాష వేణి మల్లేశం, మోతె ప్రశాంత్‌రెడ్డి, గుర్రం తిరుపతిరెడ్డి, కమల్‌గౌడ్, కార్పొరేటర్ గుమ్మడి రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మీసాల శంకర్, జగ్గాని కనకయ్య, కాంగ్రెస్ నాయకులు మూల కృష్ణారెడ్డి అనంతుల రమేష్, పోరండ్ల రమేష్, ఉప సర్పంచ్ గాలిపల్లి రవి పద్మశాలీ సంఘం అధ్యక్షుడు దూడం మల్లేశం, దాసరి ఆంజనేయులు, భూర్ల లక్ష్మీరాజం, దికొండ శంకరయ్య, గాజంగి రమేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# హామీలను అమలు చేయాలి

- సిపిఎం నేత పోతినేని సుదర్శన్
- కార్మికుల సమ్మెకు సిపిఎం మద్దతు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు తెలిపారు. స్థానిక మంచికంటి భవన్లో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి నుండి ఆటో కార్మికులు ప్రైవేటు వ్యాను స్కూల్ వ్యాన్లు బందును జయప్రదం చేయాలని ఈ బంద్ కు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు పన్నెండు వేల రూపాయలు ఇస్తానన్న ఆర్థిక సహాయం ఇవ్వాలని ఆర్టీసీ సంస్థ తరపున ఎలక్ట్రికల్ ఆటో వాహనాలు నడపాలని చేస్తున్న ప్రయత్నం రద్దు చేయాలని రాపిడో ఓలా ఉబర్ రద్దుచేసి ప్రభుత్వమే యాప్ ద్వారా రాపిడో సంస్థను నడపాలని తదితర సమస్యల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆటోలు బంద్ చేయాలని కార్మిక సంఘాల జేఏసి పిలుపునివ్వడం జరిగిందనీ రవాణా శాఖ మంత్రి కార్మిక సంఘాలు చేపట్టిన బంద్ విరమించాలని ప్రకటనకే పరిమితం అయ్యారు తప్ప కార్మిక సంఘాల జేఏసితో ఎందుకు చర్చలు జరిపరని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆటో కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. రవాణా రంగ కార్మికులు కుటుంబాన్ని పోషించలేక అప్పుల పాలయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, అన్నవరపు సత్యనారాయణ, కారం పుల్లయ్య, బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ ఏ నబి, నిమ్మల వెంకన్న, వంశీ, పిట్టల అర్జున్, చిలకమ్మ, వీర్ల రమేష్, గడ్డం స్వామి, భూక్య రమేష్, కోబల్, నరేష్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.



## కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన యర్రం రాజశేఖర్ రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ప్రముఖ కాంట్రాక్టర్ బీఆర్ఎస్ కు చెందిన యర్రం రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రజాసేవా భవన్‌లో అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ లో కి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణం కోసం ఆయన ఒక లక్షా నూట పదకొండు రూపాయల విలువ గల చెక్కును విరాళంగా కంది శ్రీనివాస రెడ్డి కి అందజేశారు.





# ఆడె గజేందర్ బర్త్ డే వేడుకల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** పార్టీలో సిన్సియర్ గా పనిచేస్తూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న నాయకుడు బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్ అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కొనియాడారు. ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలో జరిగిన ఆయన పుట్టిన రోజు వేడుకలకు కంది శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు.కేక్ కట్ చేసిన అనంతరం బొకే అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పటికి కూడా నిరాశ చెందకుండా పార్టీలో చురుకైన నాయకుడిగా పని చేస్తున్నారన్నారు.తను కష్టజీవి అని అదే తత్వంతో బోథ్ నియోజకవర్గంలో నాయకులు కార్యకర్తలు ప్రజల మన్ననలు పొందారని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాలలోకి వచ్చారని ఆర్థికంగా కష్టాలెదురైనా ముందుకు సాగుతున్నారన్నారు. నిజాయితీ నిబద్ధతతో తన శక్తికి మించిన విధంగా పార్టీ కోసం కష్టపడుతున్నారన్నారు.ఆడె గజేందర్ లాంటి నేతతో కలిసి పార్టీలో కొనసాగడం చాలా ఆనందంగా ఉందన్నారు.మనమంతా కాంగ్రెస్ పార్టీ జెండా కింద



పనిచేస్తున్నామని పార్టీ గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.అందరి ఆశీర్వాదంతో రాజకీయంగా ఆయన అత్యున్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మాజీ ఎంపీ సోయం బాపు రావు,ఆత్మ కమిటీ చైర్మన్లు గిమ్మ సంతోష్‌రావు,గొర్ల రాజు యాదవ్ , నాయకులు అడ్డి భోజరెడ్డి,గోక గణేష్ రెడ్డి,సాజిద్ ఖాన్,పసుల చంటి, సింగిరెడ్డి రాంరెడ్డి, గౌతమ్ రెడ్డి, ఆడే శీల,ఎంఏ షకీల్ ,లంక సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



## జిహెచ్ఎంసి నిర్లక్ష్యానికి చెత్తా చెదారం నిలువెత్తు నిదర్శనం

**డివిజన్ అధ్యక్షులు, కోల్లన్ ప్రదీప్ రెడ్డి...**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ 118 డివిజన్ పరిధి సాతాంరాయిలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొల్లన్ ప్రదీప్ రెడ్డిఆధ్వర్యంలో ఆదివారం బస్తీ బాట కార్యక్రమంనిర్వహించారు.సాతాంరాయిలోని వివిధ కాలనీలో నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో శానిటేషన్, మంచినీరు, రోడ్లు, స్మశాన వాటిక తదితర సమస్యలను బిఆర్ఎస్ పార్టీ నాయకుల దృష్టికి తెచ్చారు. జిహెచ్ఎంసి ఏర్పడిన తర్వాత శానిటేషన్ సమస్య అత్యంత దారుణంగా ఉందని స్థానికులు వాపోయారు. శానిటేషన్ సమస్యను పరిష్కరించాలని బిఆర్ఎస్ నాయకులను కోరారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి తెలిపారు. జిహెచ్ఎంసి అధికారులు పేదల నివసించే కాలనీలలో శానిటేషన్ చేయటం లేదని మండిపడ్డారు. జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం కనిపిస్తుందన్నారు. శానిటేషన్ ఉన్నత వర్గాలక కాలనీలకే పరిమితమైందని డివిజన్ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ పరిసరాలు శుభ్రం చేయడంలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జనార్దన్ యాదవ్, రాహుల్, అప్ప, కృష్ణగౌడ్, మంచర్ల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఎడతెరపి లేని వానలో.. శుభకార్యాలతో ఎమ్మెల్యే పాయం బిజీబిజీ

- పలుచోట్ల వివాహ వేడుకలకు హాజరు..
- నూతన వధూవరులకు ఆశీర్వాదాలు
- కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ మంతనాలు

**మణుగూరు, మహా :** ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల్లో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరై బిజీబిజీగా గడిపారు. కుటుంబ సమేతంగా శుభకార్యాల్లో పాల్గొన్న ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఆత్మీయంగా పలకరించి వారితో ముచ్చటించారు. పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద జరిగిన వివాహ వేడుకలో బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామ మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి-సత్యవతి దంపతుల కుమారుడు చెన్నకేశవరెడ్డి-స్రవంతిరెడ్డి వివాహానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించడంతో పాటు నూతన వస్త్రాలను అందజేశారు. దంపతులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం మణుగూరు మండలం అంబేద్కర్ సెంటర్‌లో గడ్డం రామమూర్తి-హేమలత దంపతుల కుమారుడు ఉదయ్‌కిరణ్-తేజశ్రీ వివాహ వేడుకకు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించారు. అదేవిధంగా మణుగూరు బొంబాయి కాలనీలో బండారి జయరాజు-జ్యోతి దంపతుల కుమార్తె తనూజ-రోహిత్ వివాహ వేడుకలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. నూతన దంపతులకు ఆశీర్వాదాలు అందించి, వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలకు హాజరైన సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఎడతెరిపి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వరుస శుభకార్యాలకు హాజరవుతూ వధూవరుల కుటుంబాలతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మణుగూరు మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, ఐఎన్‌టీయూసీ నాయకులు, రాష్ట్ర, జిల్లా, మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వధూవరుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ కొలువులు సాధించాలి : ఎస్పీ అఖిల్ మహాజన్

- జిల్లా పోలీస్ శాఖా ఆధ్వర్యంలో అర్హత పరీక్ష
- 3446 మంది అభ్యర్థుల హాజరు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ
- ఎంపికైన వారికి ఉచిత శిక్షణ

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం నిర్వహించనున్న ఉచిత కోచింగ్‌కు సంబంధించి ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్షకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొత్తం 3446 మంది అభ్యర్థులు అర్హత పరీక్షకు హాజరయ్యారు.పరీక్షల నిర్వహణను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాల వద్ద దాదాపు 200 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, అభ్యర్థుల రాకపోకలు, పరీక్ష కేంద్రాల వద్ద భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులు జిల్లాకు చెందిన ఆదివాసీలను ఎంపిక చేసి దాదాపు 300 మంది అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదివాసీ అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించి, వారికి పోటీ పరీక్షల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో మెరుగైన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రతిభ కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎం. వెంకట నరసయ్య, సీఐలు బీడీ ప్రేమ్ కుమార్, రహీం పాషా, ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటి, రూరల్ ఎస్సై విష్ణువర్ధన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పట్టుదలగా చదివి..విజయం సాధించాలి

**ఆదిలాబాద్ మహా:** నిర్దిష్టమైన ప్రణాళిక, పట్టుదలతో చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత కొలువులు సాధించడం సులువవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5 నెలల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణలో భాగంగా ఆదివారం స్థానిక రాంనగర్ ఎస్సీ స్టడీ సర్కిల్ ను ఆయన సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్ బుక్కులను పంపిణీ చేశారు. తన సివిల్స్ ప్రిపరేషన్ అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటూ పోటీ పరీక్షల తయారీపై దిశానిర్దేశం చేశారు. పరీక్ష ఏదైనా ముందుగా సిలబస్‌పై సంపూర్ణ స్పష్టత ఉండాలని, పరిమిత ప్రామాణిక పుస్తకాలను మాత్రమే ఎంచుకోవాలని సూచించారు. వార్తాపత్రికలు, మేగజైన్ల నుంచి ముఖ్యమైన అంశాలను స్వయంగా నోట్స్ రాసుకుంటే చివరి సమయంలో రివిజన్ సులభమవుతుందని తెలిపారు. తక్కువ మంది మిత్రులతో గ్రూప్ స్టడీ చేయడం ద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుందని, సందేహాలు నివృత్తి అవుతాయని చెప్పారు. మాక్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు రాస్తూ తప్పులను విశ్లేషించుకోవాలని, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల్లో సరైన జవాబును గుర్తించేందుకు ఎలిమినేషన్ పద్ధతి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. త్వరలోనే




పలు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు రానున్నందున అభ్యర్థులు ఫోన్ వంటి ఆకర్షణలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదవాలని పిలుపునిచ్చారు. స్టడీ సర్కిల్ భవన శాశ్వత నిర్మాణంతో పాటు డిజిటల్ బోధనకు ఐఎఫ్‌పీ ప్యానెల్స్, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ద్వారా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. కె.రమేష్, అధ్యాపకులు, ఉద్యోగార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## కుషాయిగూడ కూరగాయల మార్కెట్‌లో ఘనంగా బోనాలు

**హాజరైన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ కూరగాయల మార్కెట్ లో నిర్వహించిన బోనాల పండుగ వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకల్లో మార్కెట్ వ్యాపారులు, స్థానిక ప్రజలు, నాయకులు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు. సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,గంప కృష్ణ గుప్తా,కుషాయిగూడ కూరగాయల మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వెంకటేష్ గుప్తా. పాండల శివకుమార్ గౌడ్, . కుషాయిగూడ కూరగాయల మార్కెట్ వర్తక వ్యాపారులు బుద్ధి లక్ష్మి, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు చిరు వ్యాపారులు. కూరగాయల మార్కెట్ వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముచ్చటగా మూడు పేర్లు..!

- రామకృష్ణాపూర్.. క్యాతనపల్లి.. రవీంద్రఖని.
- పేరు వేరైనా ఊరు ఒక్కటే

క్యాతనపల్లి మహా: మంచిర్యాల జిల్లాలోని సింగరేణి పారిశ్రామిక ప్రాంతాల్లో రామకృష్ణాపూర్ కు ఒక విశిష్టమైన గుర్తింపు ఉంది. ఈ ప్రాంతాన్ని ఒకరు రామకృష్ణాపూర్ అని పిలుస్తారు. మరొకరు క్యాతనపల్లి అంటారు. ఇంకొందరు రవీంద్రఖని అని వ్యవహరిస్తారు. ఈ మూడు పేర్లు వింటే మూడు వేర్వేరు ప్రాంతాలుగా అనిపించినా, వాస్తవానికి ఇవన్నీ ఒకే ప్రాంతానికి చెందిన పేర్లు, చరిత్ర, పరిశ్రమల అభివృద్ధి, పరిపాలనా మార్పులకు నిదర్శనంగా ఈ మూడు పేర్లు నేటికీ ప్రజల నోట వినిపిస్తూనే ఉన్నాయి. ఒకప్పుడు ఈ ప్రాంతమంతా క్యాతనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. గ్రామానికి చుట్టుపక్కల వ్యవసాయ భూములు, అడవులు ఎక్కువగా ఉండేవి. అనంతరం సింగరేణి బొగ్గు గనుల విస్తరణతో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గనుల తవ్వకాలు ప్రారంభమవడంతో కార్మికులు, అధికారులు, ఉద్యోగుల కోసం కాలనీలు నిర్మించబడ్డాయి. జనాభా వేగంగా పెరిగి, చిన్న గ్రామం క్రమంగా పారిశ్రామిక పట్టణంగా అభివృద్ధి చెందింది. సింగరేణి అభివృద్ధితో పాటు ఏర్పడిన కొత్తనివాస ప్రాంతానికి రామకృష్ణాపూర్ అనే పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రభుత్వ శాఖలు, రెవెన్యూ రికార్డులు, పోస్టల్ చిరునామాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు తదితర అధికారిక వ్యవహారాల్లో రామకృష్ణాపూర్ పేరే ప్రధానంగా ఉపయోగించబడుతోంది. జిల్లా వ్యాప్తంగా కూడా ఈ ప్రాంతం అదే పేరుతో ప్రసిద్ధి చెందింది. మరోవైపు బొగ్గు గనుల కార్యకలాపాలకు సంబంధించిన ప్రాంతాన్ని రవీంద్రఖనిగా పిలుస్తూ వచ్చారు. ముఖ్యంగా సింగరేణి ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన కార్మికులు, పాత నివాసితులు ఇప్పటికీ రవీంద్రఖని అనే పేరుతోనే ఎక్కువగా సంభాషిస్తుంటారు. సింగరేణి చరిత్రలో ముడిపడిన ఈ పేరు స్థానికుల మనసుల్లో ప్రత్యేక







స్థానాన్ని సంపాదించింది. పరిపాలనా పునర్వ్యవస్థీకరణలో భాగంగా స్థానిక సంస్థలకు మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉంది. దీంతో స్థానిక పాలన, పన్నులు, మున్సిపల్ సేవలు, అధికారిక ప్రకటనల్లో క్యాతనపల్లి పేరు వినిపిస్తోంది. ప్రజలు చిరునామా రాయాల్సి వచ్చినప్పుడు సందర్భాన్ని బట్టి రామకృ




ష్ణాపూర్, క్యాతనపల్లి లేదా రవీంద్రఖని అనే పేర్లను ఉపయోగిస్తుంటారు. బస్సుల గమ్యస్థాన బోర్డులు, ప్రభుత్వ పత్రాలు, విద్యాసంస్థల చిరునామాలు, వ్యాపార సంస్థల బోర్డులు, స్థానిక ప్రజల సంభాషణలు ప్రతి చోటా ఈ మూడు పేర్లు కనిపించడం ఇక్కడి ప్రత్యేకత. కొత్తగా వచ్చే వారికి ఇవి మూడు వేర్వేరు ప్రాంతాలుగా అనిపించినా, స్థానికులు మాత్రం "పేరు ఏదైనా... ఊరు ఒక్కటే" అని చిరునవ్వుతో చెబుతుంటారు. చరిత్రను గుర్తు చేసే కృతనపల్లి, అభివృద్ధికి ప్రతీకగా నిలిచిన రామకృష్ణాపూర్, సింగరేణి వైభవాన్ని ప్రతిబింబించే రవీంద్రఖని ఈ మూడు పేర్లు కలిసి ఈ ప్రాంత సామాజిక, పారిశ్రామిక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. "పేర్లు మూడు అయినా ప్రజల అనుబంధం మాత్రం ఒక్కటే. అదే ఈ ప్రాంత ప్రత్యేకత. ముచ్చటగా మూడు పేర్లు... 'పేరు వేరైనా, ఊరు ఒక్కటే! అనే మాటకు ఈ ప్రాంతమే నిలువెత్తు నిదర్శనం.

# ఒక్క ఫొటో వెయ్యి పదాల భావం

- **ఒక్క ఫోటో. చిరకాలం జ్ఞాపకాలు.**
- **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా:** ఒక్క ఫొటో వెయ్యి పదాల భావాన్ని తెలియజేస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫొటో జర్నలిస్టులకు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఒక ఫొటోను చూడగానే దానికి సంబంధించిన జ్ఞాపకాలు మనసులో మెదులుతాయన్నారు. ఎండా వానలను లెక్కచేయకుండా వృత్తి పట్ల అంకితభావంతో పనిచేస్తూ చరిత్రలో నిలిచిపోయే ఎన్నో ఛాయా చిత్రాలను ఫొటో జర్నలిస్టులు చిత్రీకరిస్తున్నారని కొనియాడారు. సమాజ సేవలో ఫొటో జర్నలిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.ఒక్క ఛాయాచిత్రం ద్వారా ప్రజల్లోనూ, ప్రభుత్వ యంత్రాంగంలోనూ కదలిక తీసుకురాగల సందర్భాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. నేటి కాలంలో వార్తాపత్రికల్లో ఫొటోకు ఎంతో ప్రాధాన్యం ఉందని, చాలామంది వార్తను చదవకముందే ఫొటోను చూసి దాని ప్రాధాన్యాన్ని అంచనా వేస్తున్నారని చెప్పారు. అనేక భావాలు, విషయాలను ఒక్క ఛాయాచిత్రం ద్వారా సులభంగా తెలియజేయవచ్చన్నారు.ఫొటో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ఫొటోగ్రఫీ రంగంలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. ఫొటో జర్నలిస్టులు ప్రజా సమస్యలతో పాటు సమాజానికి ఉపయోగపడే మంచి అంశాలను కూడా కెమెరాల్లో బంధించాలని సూచించారు.నాటి మహనీయుల గురించి వారి ఛాయాచిత్రాల ద్వారానే తెలుసుకుంటున్నామని, వారి ముఖచిత్రాలు ఇప్పటికీ జ్ఞాపకాలను సజీవంగా ఉంచుతున్నాయని బండారు లక్ష్మారెడ్డి అన్నారు. జీవితంలో ఒకసారి కెమెరాలో బంధించిన ఫొటో చిరకాలం జ్ఞాపకంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. “జీవితం ఒక్కటే.. జ్ఞాపకాలు అనేకం.. ఫొటో మాత్రం నిత్యం మిగిలిపోయే జ్ఞాపకం” అని అన్నారు. ప్రతి ఏడాది ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించారు.

# జిహెచ్ఎంసి నిర్లక్ష్యానికి చెత్తా చెదారం నిలువెత్తు నిదర్శనం

- **డివిజన్ అధ్యక్షులు, కోల్లన్ ప్రదీప్ రెడ్డి...**



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ 118 డివిజన్ పరిధి సాతాంరాయిలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొల్లన్ ప్రదీప్ రెడ్డిఆధ్వర్యంలో ఆదివారం బస్తీ బాట కార్యక్రమంనిర్వహించారు.సాతాంరాయిలోని వివిధ కాలనీలో నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో శానిటేషన్, మంచినీరు, రోడ్లు, స్మశాన వాటిక తదితర సమస్యలను బిఆర్ఎస్ పార్టీ నాయకుల దృష్టికి తెచ్చారు. జిహెచ్ఎంసి ఏర్పడిన తర్వాత శానిటేషన్ సమస్య అత్యంత దారుణంగా ఉందని స్థానికులు వాపోయారు. శానిటేషన్ సమస్యను పరిష్కరించాలని బిఆర్ఎస్ నాయకులను కోరారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి తెలిపారు. జిహెచ్ఎంసి అధికారులు పేదల నివసించే కాలనీలలో శానిటేషన్ చేయటం లేదని మండిపడ్డారు. జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం కనిపిస్తుందన్నారు. శానిటేషన్ ఉన్నత వర్గాలక కాలనీలకే పరిమితమైందని డివిజన్ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ పరిసరాలు శుభ్రం చేయడంలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జనార్దన్ యాదవ్, రాహుల్, అప్ప, కృష్ణగౌడ్, మంచర్ల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ కార్మికులపై దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- **తెలంగాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి.**

**రాజేంద్రనగర్ మహా ;** అత్తాపూర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలి పురంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులపై జరిగిన దాడిని తెలంగాణ కార్మిక సంఘం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లోకృష్ణ,అలువేలమ్మ, వెంకటమ్మ, యాదమ్మ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఉదయం లేచి విధులు నిర్వహిస్తున్నటువంటి కార్మికులపై దాడిని ఖండించారు. ఇలా దాడులు కార్మికులపై చేసే కార్మికులు ఏ విధంగా విధులు నిర్వహిస్తారని మండిపడ్డారు. పారిశుద్ధ్య పనులు ఏదైనా చేయించుకోవాలంటే కార్మికులను కొట్టి చేయించుకోవడం కాదు. అధికారులకు ఫిర్యాదు చెయ్యాలి. బస్తీలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో పారిశుధ్య కార్మికుల పై దాడి చేస్తున్నటువంటి వ్యక్తిలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ జాషువా,మహేందర్,సంగీత,రాజు, కార్మికులు సవిత, రాములమ్మ, ఉషారాణి, జె.యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత వైద్య శిబిరాన్ని లప్రారంభించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్, కాశిబుగ్గ మహా;**వరంగల్ తూర్పు నియోజక వర్గంలోని శాంతి నగర్ ప్రాంతంలో మందాస్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ మందా శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీకర హాస్పిటల్ వైద్యుల సహకారంతో నిర్వహించిన ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్యులను మరియు నిర్వాహకులను అభినందించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు అన్నారు. ముఖ్యంగా ఎముకలు, కీళ్లకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు నిపుణులైన వైద్యుల ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు, సలహాలు అందించడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.మంద హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ మందా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న శ్రీకర హాస్పిటల్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బైరి నాగరాజు, కర్నే రవీందర్, వంచనగిరి రాజకుమార్, వంగరి ప్రదీప్ మరియు నిర్వాహకులు, వైద్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలపడాలి

- **డిసిసి అధ్యక్ష ఎన్నిక పారదర్శకంగా జరుగుతుంది. పార్టీ నాయకుల అభిప్రాయాలను గౌరవిస్తాం.**
- **ఏఐసీసీ పరిశీలకులు.పివి, మోహన్**



**రాజేంద్రనగర్ మహా ;** ఏఐసీసీ సూచనల మేరకు కర్ణాటక ఎమ్మెల్సీ, రంగారెడ్డి జిల్లా ఏఐసీసీ పరిశీలకులు మోహన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవి నియామకం కోసం శంషాబాద్ తోండు పల్లిలో మనస్వి గార్డెన్స్‌లో ఆదివారం సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించారు. పార్టీని క్షేత్ర స్థాయిలో పటిష్టం చేసేందుకు బూత్ స్థాయి కమిటీల బలోపేతంపై ఆయన నాయకులతో చర్చించారు.ఈ సందర్భంగా పివి మోహన్ మాట్లాడుతూ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని పేర్కొన్నారు.సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసి, ప్రజలతో బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమని పివి మోహన్ తెలిపారు. డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామన్నారు.పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించే, అందరినీ కలుపుకుని పనిచేసే నాయకత్వాన్ని పారదర్శకమైన విధానంలో ఎంపిక చేస్తామన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అబ్జర్వర్లు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి శాసనసభ్యులు డా,మట్టా రాగమయి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇవి శ్రీనివాస్ రావు,డీసీసీ అధ్యక్ష పదవి పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్ ధనుంజయ, జి శేఖర్ యాదవ్, కృష్ణారెడ్డి, సంజయ్ యాదవ్, జెల్ పల్లి నరేందర్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మైలారం సులోచన, డివిజన్ అధ్యక్షులు దూడల వెంకటేష్ గౌడ్, సామా ఇంద్రపాల్ రెడ్డి, సి మహేందర్ ముదిరాజ్, బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, ప్రేమ్ గౌడ్, పి శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మహమ్మద్ గౌస్, మహమ్మద్ షౌకత్, నరేందర్, మెరుగు జితేందర్, దుర్గేష్ యాదవ్, కోటేష్ గౌడ్, రవి నాయక్, రాము నాయక్, మహమ్మద్ ఖలీల్, చందు, తదితరులు పాల్గొన్నారు.





# కొండా దంపతులను బర్తరఫ్ చేయాలి

- **పదవుల కోసం బీసీ నినాదాన్ని అడ్డుపెట్టుకోవడం సిగ్గుచేటు**
- **కాంగ్రెస్ సీనియర్ నేత నల్గొండ రమేష్**
- **అక్రమ కేసులు పెట్టిస్తున్న కొండా దంపతుల తీరు పార్టీకి తీవ్ర నష్టం**
- **సీఎం రేవంత్ కు సుస్మిత పటేల్ బహిరంగ క్షమాపణ చెప్పాలి**
- **మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్**

**వరంగల్, బ్యూరో మహా :** వరంగల్ తూర్పు కాంగ్రెస్లో ముసలం మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున తూర్పు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కొండా సురేఖ ను గెలిపించడానికి చాలామంది వరంగల్ తూర్పు కాంగ్రెస్ సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు కష్టపడి సమన్వయంతో పనిచేసి వారిని గెలిపించారని అప్పుడు గెలిపించిన వారే కొండా దంపతుల నుండి వారికి కనీస గౌరవం దక్కక, మరికొందరు పార్టీ కోసం కష్టపడ్డ వారిని పక్కనపెట్టి ఇతర పార్టీ నుండి వచ్చిన వారి చేతిలో నియోజకవర్గాన్ని అప్పగించారని వారంతా ఓ వర్గంగా విడిపోయి కొండా దంపతుల పై అసమ్మతి వర్గంగా తయారయ్యి ఇప్పుడు కొండా దంపతులనే పార్టీ నుండి బర్తరఫ్ చేయాలనే పరిస్థితి వరంగల్ తూర్పు కాంగ్రెస్లో నెలకొంది. కొండా దంపతులు వారి పదవుల కోసం బీసీలను అడ్డం పెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుతూ..అదే సామాజిక వర్గాన్ని ఎదగనివ్వడం లేదని ఆ వర్గానికి చెందిన నాయకులు ఎవరూ ఎదగకుండా అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత నల్గొండ రమేష్ బహిరంగంగా విమర్శించారు. కొండా దంపతుల అధికార దాహం వారి ఒంటెద్దు పోకడలతో ఇటు పార్టీకి, కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు తీవ్ర నష్టం జరుగుతోందని, గత కొంతకాలంగా వారు నియోజకవర్గంలో స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి కూడా లేకుండా పోయిందని అన్నారు. ఇటీవల మంత్రి జన్మదిన వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కుమార్తె సుస్మిత పటేల్ బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం రాంకీలోని మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు మంత్రి కొండా సురేఖ, కొండా మురళి, సుస్మిత పటేల్ పై తీవ్ర విమర్శలు చేశారు. కొండా దంపతులు బీసీలను అడ్డం పెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుతున్నారని రమేష్ ఆరోపించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రెండో బీసీ నాయకుడు ఎదగకుండా చేస్తున్నారని విమర్శించారు. వారి గెలుపు కోసం పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులను పక్కనపెట్టి నియోజకవర్గాన్ని ఒకరి చేతుల్లో పెట్టారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పై సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు పార్టీకి తీవ్ర నష్టం కలిగించేలా ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా కొండా సురేఖ గెలుపు లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కష్టం తో పాటు ఎన్నికల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఓట్లు వేయలేదని అన్ని కుల మతాలు వివిధ వర్గాల వారు ఒక్కటై ఓట్లు వేస్తేనే ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేశారు.

**బీసీలను అణగదొక్కుతున్నారని ఆరోపణలు**

ఈ సమావేశంలో వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేశ్ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సుస్మిత పటేల్ కు ఏం అర్హత ఉందని ప్రశ్నించారు. వరంగల్ తూర్పులో బీసీలను అణగ తొక్కడమే కొండా దంపతులు పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఓ బీసీ మహిళ అయి ఉండి బీసీలనే అణగదొక్కుతున్నారని విమర్శించారు. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తల పై అక్రమంగా కేసులు పెట్టించి రౌడీషీట్లు ఓపెన్ చేయిస్తున్నారని ఆరోపించారు. పార్టీ కోసం పనిచేసే వారిని ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

**ఏ హోదా ఉందని కొండా మురళికి టికెట్లు ప్రకటిస్తారు?**

**మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్***

బీసీ నినాదంతో పదవులు చేపట్టి బీసీలనే అనగదొక్కుతూ గెలిపించిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల పై అక్రమ కేసులు పెట్టించిన కొండా మురళికి ఏ హోదా ఉందని పరకాల టికెట్, కార్పొరేటర్ల టికెట్లు ప్రకటిస్తారు? మీరెవరు ప్రకటించడానికి?” అని మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ ప్రశ్నించారు. క్రమశిక్షణ లేని వారు పార్టీలో ఉండకూడదని మంత్రి పదవి నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి పదవి నుంచి ఎప్పుడు బర్తరఫ్ అవుతుందా అని ఆ వేడుకల కోసం తూర్పు నియోజకవర్గ ప్రజలు, నిజమైన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఎదురు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. కొండా దంపతుల వ్యవహార శైలి శాడిజాన్ని తలపించేలా ఉందని, వారి నిరంకుశ వైఖరిని ప్రశ్నిస్తున్న తూర్పు కాంగ్రెస్ సీనియర్ నాయకులను కార్యకర్తలను కొట్టిస్తున్న వీడియోలను చూసి ఆనందిస్తారని ఆరోపిస్తూ తీవ్రంగా తప్పుబట్టారు. అంతేకాకుండా నియోజకవర్గంలో కొండా దంపతుల ఆదేశాలతో అక్రమ కేసుల్లో బలైన నాయకులు కార్యకర్తల పేర్లను నరేందర్ వెల్లడించారు. ప్రస్తుతం వారితో ఉన్నవారు ప్రేమతో కాకుండా కేవలం భయంతో జై కొట్టడానికి ఉన్నారని అన్నారు. మీరు అనుకున్నట్టుగా మీది ఊపు కాదు.. వాపు అని ఎద్దేవా చేశారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఉన్న నాయకులను కార్యకర్తలను కొండా దంపతులు పూర్తిగా విస్మరించారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు బస్వరాజు పెద్ద కుమార్, తోట హరీష్, డిష్ శ్రీనివాస్, గోరంట్ల రాజు, బాలరాజు, సందీప్ వినోద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అడ్వాన్స్డ్ లివర్ గ్యాస్ట్రో సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని

**హనుమకొండ, మహా ;**హనుమకొండ బాల సముద్రం లోని శ్రీలక్ష్మి టెస్ట్ ట్యూబ్ సెంటర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన శశ్రీక్ అడ్వాన్స్డ్ లివర్ గ్యాస్ట్రో సెంటర్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎంతోకాలంగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న శ్రీలక్ష్మి హాస్పిటల్ లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఈ నూతన లివర్ గ్యాస్ట్రో సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులైన వైద్యుల సేవలతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు.లివర్, జీర్ణకోశ సంబంధిత వ్యాధులకు అత్యాధునిక వైద్య సేవలు అందించే ఈ సెంటర్ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా నూతన అడ్వాన్స్డ్ లివర్ గ్యాస్ట్రో సెంటర్ డా శ్రీ లక్ష్మి, డాక్టర్ శశ్రీక్ లను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభినందించారు.

# ఖిలా వరంగల్ పడమర కోటలో తీవ్ర తాగునీటి సమస్య

- **పరిష్కరించని బల్దియా అధికారులు, పట్టించుకోని పాలకులు**
- **తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

**ఖిలా వరంగల్ మహా ;** గ్రేటర్ వరంగల్ నగరంలో కొన్ని డివిజన్ల లో తాగునీటి సమస్య తీవ్రతరంగా మారింది. బల్దియా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన అధికారుల సిబ్బంది నిర్లక్ష్యం ప్రజలకు అది శాపంగా మారింది. నగరంలో కొన్ని చోట్ల రోజుల తరబడి నెలలుగా మంచినీటి సరఫరా కావడం లేదని ప్రజలు మండి పడుతున్నారు. జిల్లాల కలెక్టర్లు, బల్దియా కమిషనర్ సమావేశాలు నిర్వహించి నగరంలో నీటి సరఫరా కు ఎటువంటి అంతరాయం కలుగవద్దని ఆదేశాలు జారీ చేసిన అవి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సుమారు 25 సంవత్సరాల క్రితం ఖిలా వరంగల్ ప్రాంతంలో తీవ్ర తాగునీటి సమస్య ఏర్పడిన సమయంలో ప్రజలు అనేక ధర్నాలు, ఆందోళనలు చేయడం జరిగింది. ఆ పోరాటాల ఫలితంగా కిలా వరంగల్ మధ్య కోటలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. ఆ ట్యాంక్ నిర్మాణం తర్వాత కొంతకాలం, సుమారు మూడు సంవత్సరాల వరకు, ప్రజలకు నీటి సమస్య లేకుండా సక్రమంగా నీటి సరఫరా జరిగింది.కానీ గత మూడు సంవత్సరాలుగా ఖిలా వరంగల్, ముఖ్యంగా పడమరకోట ప్రాంత ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతూ, ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది.

**ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు**

మధ్య కోటలో వాటర్ ట్యాంక్ నిర్మించిన సమయంలో పడమరకోట కు నీరు అందించే కనెక్షన్ ను ఎవరి సమక్షంలో, ఏ కారణంతో తొలగించారు?ఆ కనెక్షన్ ను స్థానిక కార్పొరేటర్ సమక్షంలోనా? సంబంధిత అధికారుల సమక్షంలోనా?తొలగించడానికి సంబంధించిన అధికారిక నిర్ణయం లేదా అనుమతి ఎవరు ఇచ్చారు?ప్రజలకు రాజకీయ ఆరోపణలు కాదు వాస్తవ సమాధానాలు రావాలి శాశ్వత పరిష్కారం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.పడమర కోటకు గతంలో ఉన్న నీటి సరఫరా కనెక్షన్ ను పరిశీలించి, అవసరమైతే పునరుద్ధరించి, ప్రజలకు క్రమం తప్పకుండా తాగునీరు అందించేలా బల్దియా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఏపీలో ప్రభుత్వ బడులపై జగన్ ప్రశ్నలు

**అమరావతి, మహా.:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడైస్ ప్లస్ గణాంకాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 2023-24లో 40,50,116 ఉండగా 2025-26లో 34,93,450కు పడిపోయిందని తెలిపారు. అంటే 5,56,666 మంది విద్యార్థులు తగ్గారని పేర్కొన్నారు.అదే కాలంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య సుమారు 45 వేల నుంచి 44,222కు తగ్గిందని, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు 991 నుంచి 797కు తగ్గాయని జగన్ వెల్లడించారు. మరోవైపు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45,53,380 నుంచి 48,40,296కు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ గణాంకాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విద్యార్థుల నిష్క్రమణపై ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.

# అంజయ్యనగర్‌లో మరో అక్రమ భవనానికి కూల్చివేత

**ఆరు అంతస్తుల నిర్మాణంపై చర్యలు. భారీ యంత్రంతో రంగంలోకి అధికారులు.**

**హైదరాబాద్, మహా.:** గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాలపై అధికారుల చర్యలు కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినట్లు గుర్తించిన మరో ఆరు అంతస్తుల భవనాన్ని కూల్చివేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. భారీ కూల్చివేత యంత్రాన్ని ఇప్పటికే ఘటనాస్థలికి తరలించారు.గచ్చిబౌలి ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై వరుస చర్యలు చేపడుతున్న అధికారులు, అనుమతులు, నిర్మాణ పరిమితులు, భూ వినియోగ నిబంధనలను పరిశీలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై చర్యలు తీసుకోవడంతో పాటు వాటి నిర్మాణానికి సహకరించిన వ్యక్తులు, సంస్థల పాత్రను కూడా పరిశీలించే అవకాశం ఉంది.వేగంగా అభివృద్ధి చెందుతున్న గచ్చిబౌలి పరిధిలో భూముల విలువ భారీగా పెరగడంతో నిర్మాణ రంగం విస్తరించింది. ఈ నేపథ్యంలో అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టడం, పార్కింగ్ నిబంధనలు పాటించకపోవడం, ఫైర్ సేఫ్టీ ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఒక నిర్మాణదారుడి అరెస్టు, మరో భవనంపై కూల్చివేతకు ఏర్పాట్లు జరగడం గచ్చిబౌలి ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు మరింత వేగవంతం కానున్నాయన్న సంకేతాన్ని ఇస్తోంది.

# అన్ని భాషల్లోనూ రుక్మిణి హవా

కన్నడ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణి వసంత్.. ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో బిజీ హీరోయిన్‌గా మారారు. సహజమైన నటన, భావోద్వేగాలను అద్భుతంగా పలికించే అభినయం, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె.. కన్నడతో పాటు తెలుగు, తమిళ, మలయాళ చిత్రాల్లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు.2019లో వచ్చిన కన్నడ థ్రిల్లర్ చిత్రం 'బీర్బల్'తో రుక్మిణి వసంత్ సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత 2023లో విడుదలైన 'సప్త సాగరదాచే ఎల్లో: సైడ్ ఏ', 'సైడ్ బీ' చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఈ రొమాంటిక్ డ్రామాల్లో ఆమె కనబరిచిన నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అంతేకాకుండా ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్ అవార్డ్స్‌లో ఉత్తమ నటి - కన్నడ విభాగంలో పురస్కారం అందుకుని తన ప్రతిభను చాటుకున్నారు.ఆ తర్వాత 'బాణదారియల్లి' చిత్రంలోనూ రుక్మిణి తన నటనతో ఆకట్టుకున్నారు. 2024లో 'బఘీరా', 'భైరతి రణగల్' వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మరింత గుర్తింపు పొందారు. విభిన్న కథలు, బలమైన పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను జాగ్రత్తగా ముందుకు తీసుకెళ్తున్నారు.తెలుగు చిత్ర పరిశ్రమలోకి 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాతో రుక్మిణి వసంత్ అడుగుపెట్టారు. అనంతరం తమిళ సినీ రంగంలోకి 'ఏస్', 'మధరాసి' చిత్రాలతో ప్రవేశించారు. 2025లో విడుదలైన 'కాంతారా: చాప్టర్ 1' భారీ విజయాన్ని అందుకోవడంతో ఆమె క్రేజ్ దక్షిణాది వ్యాప్తంగా మరింత పెరిగింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది.ప్రస్తుతం రుక్మిణి వసంత్ చేతిలో పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. కన్నడ స్టార్ హీరో యష్ సరసన నటిస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం 2026 ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్‌తో కలిసి 'డ్రాగన్' చిత్రంలోనూ ఆమె నటిస్తున్నారు. దీంతో పాటు మలయాళ చిత్ర పరిశ్రమలోకి 'NP51' సినిమాతో అరంగేzట్రం చేయనున్నారు. తక్కువ సమయంలోనే కన్నడ నుంచి తెలుగు, తమిళ, మలయాళ చిత్ర పరిశ్రమల వరకు తన పరిధిని విస్తరించుకున్న రుక్మిణి వసంత్.. ప్రస్తుతం దక్షిణాదిలో క్రేజీ హీరోయిన్‌గా కొనసాగుతున్నారు. విభిన్నమైన కథలు, బలమైన పాత్రలతో ముందుకు సాగుతున్న ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకునే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.





## భారీ బడ్జెట్ లేకుండానే
# బాక్సాఫీస్ షేక్

సినిమా విజయానికి భారీ బడ్జెట్, స్టార్ హీరోలు, కోట్ల రూపాయల ప్రచారం తప్పనిసరి కాదని చైనాకు చెందిన యానిమేషన్ చిత్రం 'నియు లాయ్' (Niu Lai) నిరూపిస్తోంది. పరిమిత వనరులతో రూపొందిన ఈ చిన్న సినిమా.. తొలుత ఎలాంటి ఆదరణ పొందకపోయినా, సోషల్ మీడియాలో అనూహ్యంగా వైరల్ కావడంతో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం చైనా బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం భారీ వసూళ్లvను సాధిస్తూ చర్చనీయాంశంగా మారింది.ఆగస్టు 5న చైనాలోని థియేటర్లలో విడుదలైన 'నియు లాయ్'కు ప్రారంభంలో స్పందన అంతంతమాత్రంగానే ఉంది. విడుదలైన మొదటి పది రోజుల్లో ఈ చిత్రం కేవలం 10 వేల యువాన్లు మాత్రమే రాబట్టినట్లు స్థానిక బాక్సాఫీస్ గణాంకాలు వెల్లడించాయి. కొన్ని రోజుల్లో రోజువారీ వసూళ్లు 200 యువాన్లకే పరిమితమైనట్లు సమాచారం. దీంతో ఈ సినిమా పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని భావించారు. అయితే ఆ తర్వాత పరిణామాలు అనూహ్యంగా మారిపోయాయి. సినిమాలోని యానిమేషన్ శైలి, విభిన్నమైన విజువల్స్, కథనం సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. ప్రేక్షకుల కామెంట్లు, విమర్శలు, సినిమా క్లిప్స్, మీమ్స్, రియాక్షన్ వీడియోలు విస్తృతంగా వైరల్ కావడంతో 'నియు లాయ్'కు ఉచిత ప్రచారం లభించింది. సినిమా గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరగడంతో థియేటర్లలో ప్రేక్షకుల సంఖ్య కూడా క్రమంగా పెరిగింది. ఈ ఆసక్తి బాక్సాఫీస్ వసూళ్లపై స్పష్టమైన ప్రభావం చూపించింది. ఆగస్టు 20 నాటికి ఈ చిత్రం చైనా మార్కెట్‌లో 4 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసినట్లు రాయిటర్స్ నివేదికలను ఉటంకిస్తూ పలు కథనాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా రోజువారీ బాక్సాఫీస్ ర్యాంకింగ్స్‌లో హాలీవుడ్ చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' తర్వాతి స్థానంలో నిలవడం ఈ చిన్న చిత్రానికి లభించిన ఆదరణను తెలియజేస్తోంది. ఇక 'నియు లాయ్' నిర్మాణ వ్యయం కూడా ఆసక్తికరంగా మారింది. కొన్ని నివేదికల్లో ఈ యానిమేషన్ చిత్రాన్ని కేవలం 200 డాలర్ల బడ్జెట్‌తో రూపొందించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే మరికొన్ని కథనాలు నిర్మాణానికి కొన్ని వేల డాలర్లు ఖర్చయ్యాయని చెబుతున్నాయి. అందువల్ల 200 డాలర్ల బడ్జెట్ అనే సంఖ్యను అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. అమెచ్యూర్ యానిమేటర్ షిన్ యుమెంగ్, ఆయన తల్లి సన్ లిఫాంగ్ కలిసి సుమారు ఐదేళ్లపాటు ఈ ప్రాజెక్టుపై పనిచేసినట్లు సమాచారం. పెద్ద యానిమేషన్ స్టూడియో, ప్రముఖ నటీనటులు, భారీ సాంకేతిక బృందం లేకుండానే ఈ చిత్రాన్ని రూపొందించడం ఇప్పుడు ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తోంది. 'నియు లాయ్' విజయం సినిమా నిర్మాణంలో బడ్జెట్ కంటే కంటెంట్, ప్రేక్షకుల ఆసక్తి ఎంత కీలకమో మరోసారి చాటిచెబుతోంది. మొదట్లో ఎవరూ పట్టించుకోని చిత్రం.. సోషల్ మీడియా ద్వారా ఒక్కసారిగా వైరల్ కావడంతో బాక్సాఫీస్ వద్ద తన సత్తా చూపిస్తోంది. మంచి కంటెంట్‌కు ప్రేక్షకులే ప్రచారకర్తలుగా మారితే చిన్న సినిమా కూడా భారీ విజయాన్ని అందుకోగలదనే విషయానికి ఈ చిత్రం తాజా ఉదాహరణగా నిలుస్తోంది.

## 'టాక్సిక్'తో కియారా అద్వానీకి
# హిట్ వస్తుందా?

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్న కియారా అద్వానీకి అవకాశాలకు కొదవలేదు. అయితే కొంతకాలంగా ఆమె ఖాతాలో భారీ కమర్షియల్ హిట్ లేదు. 2022లో వచ్చిన 'భూల్ భులయ్యా 2' తర్వాత 'జుగ్‌జుగ్ జీయో', 'సత్యప్రేమ్ కీ కథ', 'వార్ 2' చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేదు. తెలుగులో 'భరత్ అనే నేను' తర్వాత 'వినయ విధేయ రామ', 'గేమ్ ఛేంజర్' కూడా ఆమెకు పెద్దగా కలిసిరాలేదు. ఇప్పుడు యష్ నటిస్తున్న 'టాక్సిక్'లో నాదియా పాత్రలో కియారా కనిపించనున్నారు. ఈ క్యారెక్టర్ తన కెరీర్‌లోనే భిన్నమైనదని ఆమె చెప్పినట్లు సమాచారం. సినిమాలో గ్లామర్‌తో పాటు పాత్రకు డార్క్ షేడ్స్ కూడా ఉన్నట్లు ప్రచార కంటెంట్ ద్వారా తెలుస్తోంది.వ్యక్తిగత జీవితంలోనూ కియారాకు ఇటీవల మార్పులు వచ్చాయి. సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహం చేసుకున్న ఆమె.. 2025లో తల్లిగా మారారు. అయినప్పటికీ సినిమాలకు దూరం కాకుండా కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా హీరోయిన్లకు భారీ అవకాశాలు వస్తున్న నేపథ్యంలో కియారా కూడా అదే దారిలో ముందుకు సాగుతున్నారు.యష్ సినిమా కావడంతో 'టాక్సిక్'కు భారీ ఓపెనింగ్ రావడం ఖాయమనే అంచనాలు ఉన్నాయి. అయితే నాదియా పాత్ర కూడా ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉంటే.. ఈ సినిమా కియారా కెరీర్‌కు మరో బలమైన విజయంగా నిలిచే అవకాశం ఉంది.






# రూ.200 కోట్ల క్లబ్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్'

తమిళ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో, టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. మమితా బైజు కథానాయికగా నటించిన ఈ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మించారు. విడుదలైన తర్వాత కుటుంబ ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి స్పందన లభిస్తుండటంతో వసూళ్లు క్రమంగా పెరుగుతున్నాయి.◌ాజాగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించినట్లు చిత్ర బృందం ప్రకటించింది. కుటుంబ ప్రేక్షకులు సినిమాను థియేటర్లలో ఆదరిస్తున్నారని నిర్మాతలు తెలిపారు. సినిమాలోని భావోద్వేగ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని పేర్కొన్నారు. రూ.200 కోట్ల మార్కును అందుకున్నప్పటికీ సినిమా కలెక్షన్ల జోరు కొనసాగుతోందని చిత్ర యూనిట్ వెల్లడించింది.

**ఇదీ సినిమా కథ**

'విశ్వనాథ్ అండ్ సన్స్'లో సూర్య.. సంజయ్ విశ్వనాథ్ అనే పాత్రలో కనిపిస్తారు. వ్యాపార రంగంలో బిజీగా ఉండే సంజయ్.. తన చిన్ననాటి అనుభవాల కారణంగా వివాహానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంటాడు. అయితే తన తల్లి రాధికకు సంబంధించిన కొన్ని కోరికలను నెరవేర్చినప్పటికీ.. పెళ్లి విషయంలో మాత్రం ఆమెను నిరాశపరుస్తుంటాడు. తన వంశం తనతోనే ముగిసిపోతుందనే బాధ తల్లిలో ఉందని తెలుసుకున్న సంజయ్.. సరోగసీ ద్వారా ఓ బిడ్డకు తండ్రి కావాలని నిర్ణయించుకుంటాడు. అయితే ఆ తర్వాత అతడి జీవితంలో అనుకోని సమస్య ఎదురవుతుంది. చిన్నారికి అరుదైన బోన్ మ్యారో సంబంధిత వ్యాధి ఉన్నట్లు తెలుస్తుంది. చికిత్సకు తల్లి నుంచి బోన్ మ్యారో అవసరమని తెలుసుకున్న సంజయ్.. ఆ తల్లి కోసం అన్వేషణ మొదలుపెడతాడు.ఈ ప్రయాణంలో అతడికి మ్యాడీ అనే యువతి పరిచయమవుతుంది. ఈ పాత్రను మమితా బైజు పోషించారు. మ్యాడీతో కలిసి భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత సంజయ్ జీవితంలో అనేక కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయి. కుటుంబ బంధాలు, తల్లిదండ్రులు-పిల్లల మధ్య అనుబంధం, ప్రేమ, బాధ్యత, భావోద్వేగాల చుట్టూ కథ ముందుకు సాగుతుంది.సూర్య తన పాత్రను సహజంగా పోషించడం, వెంకీ అట్లూరి కథన శైలి, కుటుంబ అనుబంధాలను తెరపై ఆవిష్కరించిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి వస్తున్న స్పందన సినిమాకు బలంగా మారింది.ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. లాంగ్‌రన్‌లో మరిన్ని వసూళ్లు సాధించే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# నిత్యామీనన్ పెళ్లిపై జోరుగా ప్రచారం

దక్షిణాది సినీ పరిశ్రమలో తన సహజ నటన, విభిన్నమైన పాత్రల ఎంపికతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నిత్యామీనన్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా ఆమె పెళ్లిపై పలు రకాల ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో.. తాజాగా నిత్యామీనన్ వివాహానికి సిద్ధమయ్యారంటూ ప్రచారం జరుగుతోంది.సినిమాలతో ఇంతకాలం బిజీగా ఉన్న నిత్యామీనన్.. ఇప్పుడు వ్యక్తిగత జీవితంలోనూ ఓ కొత్త అడుగు వేయాలని నిర్ణయించుకున్నట్లు కొన్ని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆమె తల్లిదండ్రులు కూడా నిత్యకు తగిన జీవిత భాగస్వామిని వెతికే ప్రయత్నాలు ప్రారంభించారని వార్తలు వస్తున్నాయి. అయితే ఈ విషయంలో ఇప్పటివరకు నిత్యామీనన్ కానీ, ఆమె కుటుంబ సభ్యులు కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

**తల్లిదండ్రుల చేతుల్లో బాధ్యత?**

నిత్యామీనన్ జీవిత భాగస్వామి ఎంపిక విషయంలో కుటుంబ సభ్యులు కొన్ని విషయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కులం, మతం వంటి అంశాల కంటే వ్యక్తి స్వభావం, ఆలోచనా విధానం, మంచి మనసు, పరస్పర అవగాహన ముఖ్యమనే అభిప్రాయంతో సంబంధాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఇవన్నీ ప్రస్తుతం వినిపిస్తున్న వార్తలు, ఊహాగానాలే తప్ప అధికారికంగా ధృవీకరించబడలేదు.ఇప్పటివరకు నిత్యామీనన్ వ్యక్తిగత జీవితంపై పెద్దగా గాసిప్స్ కూడా కనిపించలేదు. కెరీర్‌లో పలువురు హీరోలతో కలిసి నటించినప్పటికీ.. ఫలానా నటుడితో ప్రేమలో ఉన్నారనే వార్తలు కానీ, డేటింగ్ చేస్తున్నారనే ప్రచారం కానీ పెద్దగా తెరపైకి రాలేదు. నిత్య కూడా తన వ్యక్తిగత జీవితాన్ని మీడియా దృష్టికి దూరంగా ఉంచుతూ వస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com